

● అసెంబ్లీలో ఎమ్మెల్యేలకు నమస్కరిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

..అనే నేను

- వేడుకగా ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం
- ఆరోసారి కన్నా, ధూళిపాళ్ల, ఐదోసారి గొట్టిపాటి..
- నియోజకవర్గాల్లో పెద్దఎత్తున శ్రేణుల సంబరాలు








గుంటూరు, నరసరావుపేట, బాపట్ల, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ఉత్సాహంగా సీనియర్లు.. ఉత్సుకతతో తొలిసారి ఎన్నికైన వారు శుక్రవారం అసెంబ్లీలోకి అడుగు పెట్టారు. ..అనే నేను అంటూ శుక్రవారం అమరావతిలోని అసెంబ్లీ సమావేశ మందిరంలో ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారు ప్రమాణ స్వీకారం చేశారు. తొలుత సీఎం చంద్రబాబు, ఆ తర్వాత ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లతో ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రమాణ స్వీకారం చేయించగా ఆ తర్వాత మంత్రులు, అక్షర క్రమంలో ఎమ్మెల్యేలు వరుసగా ప్రమాణ స్వీకారం చేశారు. అనే నేను.. శాసనసభ సభ్యుడిగా ఎన్నికైనందున శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతా.. అంటూ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయా ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం అనంతరం స్పీకర్ స్థానంలో ఉన్న బుచ్చయ్యచౌదరిని కలవడం ఆ తర్వాత చంద్రబాబు, లోకేశ్, పవన్‌కల్యాణ్‌లకు ఇతర సీనియర్ ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలపగా ఆయా నేతలతో పాటు సహచరులు వారిని ప్రత్యేకంగా అభినందించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు సంబంధించి తొలుత మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయించారు. సచివాలయంలో ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారాలను వారివారి నియోజకవర్గాల్లో శ్రేణులు ప్రత్యేకంగా తిలకించారు. టపాకాయలు కాల్చి, కేకులు కట్ చేసి, స్వీట్లు పంచుకుంటూ సంబరాలు చేసుకున్నారు. ఇక గుంటూరు, బాపట్ల నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికై మంత్రులుగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నారా లోకేశ్ (మంగళగిరి), నాదెండ్ల మనోహర్(తెనాలి), అనగాని సత్యప్రసాద్(రేపల్లె), గొట్టిపాటి రవికుమార్ (అద్దంకి) తొలుత ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు. ఆరోసారి అసెంబ్లీలోకి అడుగుపెట్టి ప్రమాణ స్వీకారం చేసిన వారిలో కన్నా లక్ష్మీనారాయణ (సత్తెనపల్లి), ధూళిపాళ్ల నరేంద్ర (పొన్నూరు)లు ఉన్నారు. అక్షర క్రమంలో పల్నాడు జిల్లాకు చెందిన యరపతినేని శ్రీనివాసరావు(గురజాల), ప్రత్తిపాటి పుల్లారావు(చిలకలూరిపేట), జూలకంటి బ్రహ్మారెడ్డి(మాచర్ల), డాక్టర్ చదలవాడ అరవిందబాబు(నరసరావుపేట), భాష్యం ప్రవీణ్(పెదకూరపాడు) ప్రమాణం చేశారు. వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శనివారం ప్రమాణం చేయనున్నారు. బాపట్ల జిల్లాకు సంబంధించి వేగేశన నరేంద్రవర్మ(బాపట్ల), ఎంఎం .కొండయ్య(చీరాల), నక్కా ఆనంద్‌బాబు(వేమూరు), ఏలూరి సాంబశివరావు(పర్చూరు) ప్రమాణ స్వీకారం చేశారు. ఇక గుంటూరు జిల్లాకు సంబంధించి గళ్లా మాధవి(గుంటూరు పశ్చిమ), మొహమ్మద్ నసీర్ (గుంటూరు తూర్పు), బూర్ల రామాంజనేయులు(ప్రత్తిపాడు), తెనాలి శ్రావణ్ కుమార్(తాడికొండ)లు శాసనసభలో ప్రొటెం స్పీకర్ సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు.



ప్రమాణం చేస్తున్న వేగేశన నరేంద్రవర్మ, ఏలూరి సాంబశివరావు, గొట్టిపాటి రవి, ఎంఎం కొండయ్య

ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తా: నారా లోకేశ్

కూటమి నేతృత్వంలో కొలువైన ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజల ఆకాంక్షను నెరవేర్చే విధంగా పనిచేస్తుందని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. మంగళగిరి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన ఆయన భావోద్వేగ క్షణాలను ఆస్వాదిస్తూ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజల ఆశీస్సులతో తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టి శాసనసభ్యుడిగా ప్రమాణస్వీకారం చేయడం జీవితంలో మరపురాని మధుర ఘట్టమన్నారు. ప్రజలు తనపై ఎంతో నమ్మకంతో ఇచ్చిన ఈ అవకాశాన్ని వారి సంక్షేమం, అభివృద్ధి కోసం వినియోగిస్తానని తెలిపారు.

● బాపట్ల జిల్లా నుంచి ప్రమాణం చేస్తున్న అనగాని సత్యప్రసాద్, నక్కా ఆనందబాబు





● గుంటూరు జిల్లా నుంచి ప్రమాణం చేస్తున్న నారా లోకేశ్, నరేంద్ర, శ్రావణ్‌కుమార్, రామాంజనేయులు, నాదెండ్ల మనోహర్, గళ్లా మాధవి, నసీర్ అహ్మద్

● పల్నాడు జిల్లా నుంచి కన్నా లక్ష్మీనారాయణ, యరపతినేని శ్రీనివాసరావు, ప్రత్తిపాటి పుల్లారావు, జూలకంటి బ్రహ్మారెడ్డి, చదలవాడ అరవిందబాబు, భాష్యం ప్రవీణ్








- కేంద్ర సహాయమంత్రిగా గుంటూరులో తొలిఅడుగు
- కాజా టోల్‌ప్లాజా నుంచి ఐదుగంటల పాటు సాగిన ర్యాలీ
- వందల కార్లు, వేలాది బైకులతో హోరెత్తించిన అభిమానులు
- హామీలు నెరవేర్చేందుకు సొంత డబ్బునైనా ఖర్చు చేస్తా : చంద్రశేఖర్

పెమ్మసాని.. విజయోత్సాహం





గుంటూరు, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత తన సొంత నియోజకవర్గం గుంటూరులో డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శుక్రవారం తొలి అడుగు వేశారు. ఈ సందర్భంగా చేపట్టిన విజయోత్సవ ర్యాలీకి అభిమానులు, కూటమి శ్రేణులు నీరాజనాలు పలికారు. కాజ టోల్ ప్లాజా వద్ద ప్రారంభమైన ప్రదర్శన గుంటూరు నగరంలోకి సాయంత్రం ఐదున్నర గంటలకు ప్రవేశించగా సమావేశ ప్రాంతమైన శ్రీ కన్వెన్షన్ చేరుకునే సరికి రాత్రి పది గంటలు దాటింది. పెమ్మసానికి వందలాదిమంది తెలుగు తమ్ముళ్ల, జనసైనికులు, బీజేపీ నేతలు, స్థానిక ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. బాణాసంచా పేల్చి, తారాజువ్వలు ఎగరేసి, అడుగడుగునా భారీ గజమాలలతో స్వాగతం పలికారు. డీజేలు, దాండియాల మోతలతో ఆయనను ఊరేగించారు. లాడ్జి సెంటర్లో జనసైనికులు, తాడిశెట్టి యూత్, నాయుడుపేట సెంటర్‌లో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, 46వ డివిజన్లో కార్పొరేటర్ బాలాజీ భారీ గజమాలలతో పెమ్మసానికి స్వాగతం పలికారు. టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ 1500 బైక్‌లు, 500 కార్లతో గుంటూరు నుంచి ర్యాలీగా కాజ టోల్ గేట్‌కు ఎదురెళ్లి పెమ్మసానికి స్వాగతం పలికారు.

అమరావతి, రైల్వే అభివృద్ధి కోసం కృషి చేస్తా

ప్రదర్శన అనంతరం శ్రీకన్వెన్షన్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పెమ్మసాని ప్రసంగించారు. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండి సేవ చేస్తానని తెలిపారు. రాజధాని అమరావతి, రైల్వే అభివృద్ధి సహా, ఐదేళ్లుగా ఆగిపోయిన ప్రతి పనిని పూర్తిచేసే బాధ్యత తీసుకుంటానని చెప్పారు. హామీలను నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని, అవసరమైతే సొంత నిధులు వెచ్చిస్తానని తెలిపారు. పేదవాడు.. అవినీతి ఉండకూడదు.. గ్రామాలు అభివృద్ధి చెందాలి.. అన్న లక్ష్యాలతో ముందుకు సాగుతానన్నారు. అమరావతికి పట్టిన చీకట్లు చెరిగిపోయాయని, కిరణాల వెలుగు మొదలైందన్నారు. కొంచెం సమయం ఇవ్వండి.. అభివృద్ధిని చేసి చూపించే బాధ్యత తమదన్నారు. కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్, బూర్ల రామాంజనేయులు, ధూళిపాళ్ల నరేంద్రకుమార్, తెనాలి శ్రావణ్ కుమార్, టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, పెమ్మసాని సతీమణి శ్రీరత్న, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, టీడీపీ నాయకులు కోవెలమూడి రవీంద్ర, మన్నవ మోహన్‌కృష్ణ, ముత్తినేని రాజేశ్, నిమ్మల శేషయ్య, తాడిశెట్టి మురళి, పాటిబండ్ల విష్ణువర్ధన్, వాసిరెడ్డి జయరామయ్య, యాగంటి దుర్గారావు, పొందూరి శేషగిరిరావు, ఉగ్గిరాల సీతారామయ్య, మద్దిరాల మ్యాని, వనమా నరేంద్ర, ముజీబ్, భీమనాథం భరత్‌రెడ్డి, రజిని, తాళ్ల వెంకటేశ్ యాదవ్, వడ్రాణం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆటోనగర్ వద్ద పెమ్మసాని ర్యాలీ

కోర్ బ్రాంచెస్‌లో బెస్ట్ సివిల్ ఇంజనీరింగ్

ఇంజనీరింగ్ అంటే కంప్యూటర్ సైన్స్ అన్నట్లుగా రోజులు మారాయి. నిజానికి కోర్ ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ లేదు. ఇంజనీరింగ్ మూలపుటమ్మలుగా ప్రసిద్ధి చెందిన మూడింటిలో సివిల్ ఒకటి కాగా మెకానికల్, ఎలక్ట్రికల్ తతిమా రెండూ. ఇప్పుడు ఉన్న ఇంజనీరింగ్ బ్రాంచ్‌లన్నింటికీ మాతృకలు ఇవే. అయితే కంప్యూటర్ మోజులో ప్రపంచవ్యాప్తంగా చాన్నాళ్ళుగా సివిల్ ఇంజనీరింగ్‌కు ఆదరణ బాగా తగ్గింది. ఆ నేపథ్యంలో సదరు డిసిప్లిన్ అవసరాన్ని, అవకాశాలను రాయపూర్ ఎన్ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు తార్కికంగా వివరించారు.



భౌతికంగా లేదంటే సహజంగా ఏర్పాటైన కట్టడాల డిజైన్, నిర్మాణం, నిర్వహణ కలగలిసిన వృత్తిపరమైన డిసిప్లిన్ సివిల్ ఇంజనీరింగ్. పబ్లిక్ వర్క్స్ అంటే రహదారులు, వంతెనలు, కాల్వలు, డ్యామ్‌లు, ఎయిర్‌పోర్టులు, మురుగునీటి వ్యవస్థలు, పైప్‌లైన్‌లు, భవనాలకు సంబంధించిన స్ట్రక్చరల్ కాంపోనెంట్స్, రైల్వేలు, వాటర్ సప్లయ్, ఇండస్ట్రియల్ ప్రాజెక్టులు, నివాస గృహాలు సహా భూమి, నీరు, పర్యావణం, సివిలైజెషన్ అలాగే సంబంధిత ప్రాసెసస్‌కు సంబంధించినవన్నీ సివిల్ ఇంజనీరింగ్‌లోకే వస్తాయి.

రిలేటెడ్ బ్రాంచ్‌లు

సివిల్(కన్‌స్ట్రక్షన్), సివిల్(పబ్లిక్ హెల్త్ అండ్ ఎన్విరాన్‌మెంట్) ఇంజనీరింగ్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, సివిల్ అండ్ రూరల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్(కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ), సివిల్ ఇంజనీరింగ్(ఎన్విరాన్‌మెంట్ అండ్ పొల్యూషన్ కంట్రోల్), సివిల్ ఇంజనీరింగ్(పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్), సివిల్ ఇంజనీరింగ్(రూరల్ ఇంజనీరింగ్), సివిల్ టెక్నాలజీకి తోడు ప్లానింగ్, ఆర్కిటెక్చర్‌కు అందులోని ఉప విభాగాలకూ ఇదే మాతృక.



కౌన్సెలింగ్ గైడెన్స్

అవకాశాలు

ప్రభుత్వ, ప్రైవేటు విభాగాల్లో సివిల్ ఇంజనీర్లకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రభుత్వ అంటే మున్సిపల్ కార్పొరేషన్స్, వాటర్ బోర్డులు, ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ, న్యూఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్, మెట్రోరైల్, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఢిల్లీ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్, మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఎయిర్ ఫోర్స్, రైల్వేస్, ఇరిగేషన్ అండ్ ఫ్లడ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్, నేషనల్ హైడ్రో-ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్, నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్, డిఫెన్స్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, ఆర్ఐటీఈఎస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డులు, వివిధ సంస్థలకు చెందిన బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ విభాగాలు సహా ఈ జాబితాకు అంతు లేదు. అలాగే అసిస్టెంట్, ఇంజనీర్, అసిసెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చీఫ్ ఇంజనీర్ వంటి ఉద్యోగాలు ప్రభుత్వ సంస్థల్లో ఉంటాయి.

- అదే ప్రైవేట్ సెక్టర్‌లోకి వస్తే ట్రైనీ ఇంజనీర్‌తో మొదలై చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వరకు వేర్వేరు హోదాల్లో ఉద్యోగాలు ఉంటాయి. కన్‌స్ట్రక్షన్, డిజైన్ విభాగాల్లో సివిల్ ఇంజనీర్ సేవలు అవసరమవుతాయి. కాడ్(సీఏడీ) సాఫ్ట్‌వేర్‌పై పరిజ్ఞానానికి తోడు ఫైనైట్ ఎలిమెంట్ అనాలిసిస్ అలాగే అవసరమైన నైపుణ్యాలను అలవర్చుకుంటే ప్రైవేటు సంస్థల్లో ఎదుగుదలకు ఢోకా ఉండదు. ఆరంభంలో రెండున్నర నుంచి మూడున్నర లక్షల రూపాయల మేర వార్షిక ప్యాకేజ్ ఉంటుంది. ప్రైవేటు రంగంలో ముఖ్యంగా ఎల్ అండ్ టి మొదలుకుని టాటా ప్రాజెక్టు లిమిటెడ్, గ్యామన్ ఇండియా, గ్యామన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రాజెక్ట్ లిమిటెడ్, ఒమెక్స్, సూపర్‌టెక్, షాపూర్‌జి అండ్ పల్లోంజి గ్రూప్, జీఎంఆర్ గ్రూప్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, హిందుస్థాన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ, ఆఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అశోకా బిల్డ్‌కాన్, బిఎల్ కాష్యప్ అండ్ సన్స్ లిమిటెడ్, కన్సాలిడేటెడ్ కన్‌స్ట్రక్షన్ కన్సార్టియం లిమిటెడ్, ఎస్సార్ గ్రూప్, ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, జేపీ గ్రూప్, నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్, నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్, పుంజ్ లాయిడ్ తదితరాలు అతి పెద్ద కన్‌స్ట్రక్షన్ కంపెనీల్లో కొన్ని మాత్రమే.

అవసరం

సివిల్ ఇంజనీరింగ్ విషయంలో ప్రమోషన్ కార్యకలాపాలు చాలా అవసరం, కీలకం కూడా. కన్‌స్ట్రక్షన్ పరిశ్రమ, సంబంధిత సంస్థలు, వ్యవస్థలు అలాగే మీడియా ఇందుకు చేతులు కలపాల్సిన అవసరం ఉంది. రెగ్యులేటరీ వ్యవస్థలు, ప్రొఫెషనల్ సంస్థలతో కూడా కలిసి పనిచేయాలి. పే ప్యాకేజ్‌తో మొదలుపెట్టి కరికులమ్‌లో ఇండస్ట్రీ నిర్దేశిత థియరటికల్ కాన్సెప్ట్స్, నైపుణ్యాల పెంపుపై దృష్టి సారించాలి. అన్నింటికీ మించి అటు ఇండస్ట్రీ ఇటు విద్యా సంస్థలు చేతులు కలపాలి. వివిధ ఇంజనీరింగ్ విభాగాల మధ్య విద్యా సంస్థల్లో సీట్లు - భర్తీ విషయంలోనూ శాస్త్రీయ విధానాన్ని అమలు చేయాలి. ఒక జాబ్‌కు ఉన్న డిమాండ్, వేకెన్సీలను దృష్టిలో పెట్టుకుని ఇదంతా జరిగితే ఇంజనీరింగ్ విద్యావ్యవస్థలో మంచి రోజులు రావడమే కాదు, ఫలితాలూ బాగుంటాయి.

దిక్సూచి DIKSUCHI

జేఎన్‌టీయూహెచ్‌లో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు

హైదరాబాద్‌లోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూహెచ్)కి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ ఇన్నోవేటివ్ లెర్నింగ్ అండ్ టీచింగ్(డీఐఎల్‌టీ)- ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ప్రతి కోర్సులో మూడు థియరీ సబ్జెక్టులు ఉంటాయి. ఒక్కో సబ్జెక్టుకు రెండు నెలల సమయం, 24 తరగతులు, మూడు క్రెడిట్‌లు నిర్దేశించారు. సాయంత్రం ఆరున్నర నుంచి ఎనిమిదిన్నర వరకు ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. అదనంగా ఒక నెల ప్రాజెక్ట్ వర్క్ చేయాల్సి ఉంటుంది. దీనికి ఆరు క్రెడిట్‌లు ఉంటాయి. కోర్సులో భాగంగా అసైన్‌మెంట్‌లు, ఎండ్ ఎగ్జామినేషన్ ఉంటాయి. అసైన్‌మెంట్‌లకు 40 శాతం, ఎండ్ ఎగ్జామినేషన్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తారు. ఫ్యాకల్టీ మెంబర్లు, ఉద్యోగస్తులు, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. యూనివర్సిటీకి చెందిన టీచింగ్&నాన్ టీచింగ్ సిబ్బంది, అకడమిక్ స్టూడెంట్స్‌కు కోర్సు ఫీజులో 40 శాతం రాయితీ లభిస్తుంది.

క్లౌడ్ అండ్ డెవోప్స్ కోర్సు: ఇందులో క్లౌడ్ టెక్నాలజీ ఏడబ్ల్యూఎస్ & మైక్రోసాఫ్ట్ అజ్యూర్, కంటిన్యూయస్ ఇంటిగ్రేషన్/కంటిన్యూయస్ డిప్లాయ్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవిజనింగ్ సబ్జెక్టులు ఉంటాయి.

డేటా సైన్స్ అండ్ జనరేటివ్ ఏఐఎల్‌ఎల్‌ఎమ్ కోర్సు: ఇందులో పైథాన్ ప్రోగ్రామింగ్, మెషిన్ లెర్నింగ్-డీప్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ అండ్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ సబ్జెక్టులు ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిప్లొమా/యూజీ/పీజీ పూర్తిచేసిన/చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్స్‌కు సంబంధించి ప్రాథమిక పరిజ్ఞానం, ఏదేని ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌పై అవగాహన తప్పనిసరి.

- **కోర్సు ఫీజు:** రూ.25,000
- **అడ్మిషన్ ఫీజు:** రూ.1000
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 20
- **దరఖాస్తుల పరిశీలన:** జూలై 31
- **ఆన్‌లైన్ మోడ్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్:** ఆగస్టు 1 నుంచి 7 వరకు
- **అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** ఆగస్టు 14
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 17
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 20 నుంచి
- **ప్రోగ్రామ్‌ల ముగింపు:** 2025 ఫిబ్రవరి 19న
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

పీజేటీఎస్ఏయూలో యూజీ ఎన్ఆర్ఐ కోటా

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)-ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా కింద బీఎస్సీ ఆనర్స్, బీటెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. విదేశాల్లో నివశిస్తున్న ఎన్ఆర్ఐ అభ్యర్థులు, ఎన్ఆర్ఐలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపీసీ, బైపీసీ స్ట్రీమ్‌లలో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. అకడమిక్ మెరిట్(ఇంటర్/పన్నెండోతరగతి మార్కులు) ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులు రూ.9,53,450లకు డీడీ, రూ.46,550ల నగదుతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. వీరికి ఫీ రీయింబర్స్‌మెంట్, ప్రభుత్వ రాయితీలు లభించవు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు.

- **బీటెక్ స్పెషలైజేషన్‌లు:** ఫుడ్ టెక్నాలజీ, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్
- **బీఎస్సీ ఆనర్స్ స్పెషలైజేషన్‌లు:** అగ్రికల్చర్, కమ్యూనిటీ సైన్స్

బైపీసీ స్ట్రీమ్ కళాశాలలు-సీట్లు: హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్‌లో బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ 10 సీట్లు; నిజామాబాద్-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) 1 సీటు; హైదరాబాద్-సైఫాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ 2 సీట్లు ఉన్నాయి.

ఎంపీసీ స్ట్రీమ్ కళాశాలలు-సీట్లు: సంగారెడ్డి-కందిలోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్‌లో బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) 3 సీట్లు; నిజామాబాద్-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) 1 సీటు; హైదరాబాద్-సైఫాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ 2 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: బైపీసీ స్ట్రీమ్ కింద అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు(ఇండియన్/విదేశీ బోర్డు) నుంచి బయలాజికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

- ఎంపీసీ స్ట్రీమ్ కింద అప్లయ్ చేసుకోవాలంటే ఏదేని ఇండియన్/విదేశీ బోర్డు నుంచి మేథమెటిక్స్ ఫిజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి పూర్తిచేసి ఉండాలి.
- అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

ముఖ్య సమాచారం

- **ప్రాసెసింగ్ ఫీజు:** రూ.5,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

నీలిట్‌లో డిప్లొమా, డిగ్రీ, పీజీ

అగర్తలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నీలిట్)- ఇంజనీరింగ్ డిప్లొమా, బీసీఏ, ఎమ్మెస్సీ(ఐటీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

ఇంజనీరింగ్ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కోదానిలో 60 సీట్లు చొప్పున మొత్తం 120 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 35 శాతం మార్కులతో పదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

బీసీఏ(బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్): ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో 40 సీట్లు ఉన్నాయి.

అర్హత: మేథ్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టులలో ఏవేని రెండు సబ్జెక్టులతో ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు; మూడేళ్ల వ్యవధి గల ఏదేని ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.

ఎమ్మెస్సీ(ఐటీ): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఎస్సీ(ఐటీ/సీఎస్)/బీసీఏ/బ్యాచిలర్ డిగ్రీ(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. మేథ్స్ ఒక సబ్జెక్టుగా ఇంటర్‌తో పాటు బీఎస్సీ/బీకాం/బీఏ పూర్తిచేసినవారు కూడా అర్హులే.

- **ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 28
- **ఎంపికైన అభ్యర్థుల మొదటి లిస్ట్ విడుదల:** జూలై 4న
- **వెబ్‌సైట్:** nielitagtadmission.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/w3c3dM3లో చదవండి.

నవ్య చిత్రజ్యోతి

పీరియాడిక్ యాక్షన్ డ్రామా



'విరుపాక్ష', 'బ్రో' చిత్రాల తర్వాత సాయిదుర్గ తేజ్ నటిస్తున్న కొత్త చిత్రం షూటింగ్ ఇటీవల ప్రారంభమైంది. రోహిత్ కేపీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. చుట్టూ ల్యాండ్ మైన్లు, మధ్యలో ఎడారి భూమిలో ఓ పచ్చని చెట్టు.. ఉన్న ఈ పోస్టర్ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఓ యూనివర్సల్ కాన్సెప్ట్‌తో ఈ సినిమా ఉంటుందని పోస్టర్ చూడగానే అర్థమవుతుంది. నిర్మాతలు మాట్లాడుతూ 'గ్రాండ్ స్కేల్‌లో భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హీరో సాయి పాత్ర చాలా శక్తిమంతంగా ఉంటుంది. ప్రత్యేకంగా రూపొందించిన భారీ సెట్‌లో ప్రస్తుతం షూటింగ్ జరుగుతోంది. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేస్తాం' అని చెప్పారు.

మా ఊరు శ్రీకాకుళం..



'వెన్నెల' కిశోర్, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషిస్తున్న చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. రైటర్ మోహన్ దర్శకత్వంలో వెన్నపూస రమణారెడ్డి నిర్మిస్తున్నారు, ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌కు మంచి స్పందన వచ్చింది. తాజాగా ఈ సినిమాలోని 'మా ఊరు శ్రీకాకుళం' పాటను దర్శకుడు హరీశ్ శంకర్ విడుదల చేశారు. శ్రీకాకుళం గొప్పతనం వివరిస్తూ రామజోగయ్య శాస్త్రి రాసిన పాటను మంగ్లీ పాడారు. సునీల్ కశ్యప్ స్వరపరిచారు. ఈ సందర్భంగా హరీశ్ శంకర్ మాట్లాడుతూ 'ఈ సినిమా టైటల్ ఫన్నీగా ఉంది. మోహన్ రచయితగా నాకు చాలా కాలం నుంచి తెలుసు. పాట విజువల్స్ బాగున్నాయి. మంగ్లీ బాగా పాడింది. వెన్నెల కిశోర్ నుంచి ఒక డిఫరెంట్ సినిమా ఎక్స్‌పెక్ట్ చేస్తున్నా' అన్నారు. ఈ చిత్రానికి పాటలు: రామజోగయ్య శాస్త్రి, కాసర్ల శ్యామ్, ఫొటోగ్రఫీ: మల్లికార్జున్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రాజేశ్ రామ్, సమర్పణ: లాస్య రెడ్డి.

ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా



తమిళ అగ్రహీరోలు రజనీకాంత్, కమల్ హాసన్ యాక్షన్ బాట పట్టారు. 'విక్రమ్', 'జైలర్' చిత్రాలతో వీరిద్దరూ తమిళంలోనే కాకుండా పాన్ ఇండియా స్థాయిలో సంచలన విజయాలు అందుకున్నారు. దీంతో తదుపరి చిత్రాలు కూడా ఇదే జానర్లో చేస్తున్నారు. మణిరత్నం దర్శకత్వంలో కమల్‌హాసన్ 'థగ్‌లైఫ్' కూడా యాక్షన్ ప్యాక్డ్‌గా ఉండబోతోంది. అలాగే శంకర్ దర్శకత్వంలో వస్తున్న 'భారతీయుడు 2' చిత్రంలో పోరాట ఘట్టాలపై అంచనాలు భారీ స్థాయిలో ఉన్నాయి. 'జైలర్' ఊపులో రజనీకాంత్ సైతం ఇలాంటి చిత్రాలకు పెద్ద పీట వేస్తున్నారు. ప్రస్తుతం ఆయన హీరోగా రూపొందుతున్న చిత్రం 'వేట్టయాన్'. 'జై భీమ్' ఫేమ్ జ్ఞానవేల్ రాజా దర్శకుడు ఇందులో రజనీకాంత్ ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ పాత్రలో కనిపించనున్నారు. చిత్రీకరణ చివరి దశలో ఉంది. 'వేట్టయాన్' తర్వాత రజనీకాంత్ లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' చిత్రం చేస్తున్నారు. అయితే రజనీకాంత్ ఈ సినిమాలో కూడా ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గానే కనిపించనున్నారని కోలీవుడ్ టాక్. మానవ అక్రమ రవాణాను అడ్డుకునే నిజాయితీపరుడైన పోలీస్ ఆఫీసర్‌గా, క్రిమినల్స్‌ను ఏరివేసేందుకు ఎంతకైనా తెగించే ఖాకీగా ఆయన శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారట.



రివర్స్ లవ్‌స్టోరీ

ఆంగ్లంలో 'లవ్' అనే నాలుగు అక్షరాలను రివర్స్ చేస్తే 'ఈవోల్' అని వస్తుంది. ఆ టైటిల్‌తో ఓ రివర్స్ లవ్‌స్టోరీ వస్తోంది. సూర్య శ్రీనివాస్, శివ బొడ్డురాజు హీరోలుగా, జెన్నిఫర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో దర్శకనిర్మాత రామ్ యోగి వెలగపూడి శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ 'ఇద్దరు స్నేహితుల మధ్య కుదిరిన అవగాహన నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. వాణిజ్య విలువలతో క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందించాను. హైదరాబాద్, వైజాగ్‌లో షూటింగ్ జరిగింది' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, ఫొటోగ్రఫీ: తేడా బ్యాచ్ సినిమా టీమ్, ఎడిటింగ్: విజయ్.

ఈసారి కూడా ఓటమి లేదు



'ఇప్పటిదాకా ఒక్క ఫైట్ కూడా ఓడిపోలేదు, ఈ సారి కూడా ఓడిపోను, బాగా ప్రిపేరయ్యి వచ్చాను... చూసుకుందాం రా' అంటూ ప్రత్యర్థులకు సవాల్ విసురుతున్నారు ప్రభాస్. భారతీయ సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'కల్కి 2898 ఏడీ' చిత్రం కోసం ప్రభాస్ చెప్పిన డైలాగ్ ఇది. ఈ నెల 27న ఈ చిత్రం విడుదలవుతోంది. శుక్రవారం చిత్రబృందం రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేసింది. అమితాబ్ బచ్చన్ అశ్వత్థామగా డేరింగ్ స్టంట్స్ చేశారు. కమల్‌హాసన్ పూర్తిగా సరికొత్త లుక్‌లో ఆశ్చర్యపరిచారు. బుజ్జితో కలసి ప్రభాస్ చేసిన సాహసాలు, పోరాట ఘట్టాల్లో దిశా పటానీ మెరుపులతో ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంది. ప్రభాస్, దీపికా పదుకొనే జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి నాగ్ అశ్విన్ దర్శకుడు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ నిర్మిస్తున్నారు.

ఒదిగి ఉండే వ్యక్తిత్వం ఆయన సొంతం



ఇటీవలే ముంబైలో 'కల్కి' చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అమితాబ్ బచ్చన్ నిర్మాత సి. అశ్వనీదత్ పాదాలకు నమస్కరించబోగా, ఆయన సున్నితంగా వారించారు. ఆ తర్వాత అమితాబ్ పాదాలకు అశ్వనీదత్ నమస్కరించారు. అమితాబ్ లాంటి దిగ్గజ నటుడు తన వయసు, స్టార్‌డమ్‌ను పక్కనపెట్టి నిర్మాతకు ఎంతో గౌరవం ఇస్తూ పాదాభివందనం చేయడం ఆయన సంస్కారం, గొప్ప మనసుకు నిదర్శనం అని నెటిజన్లు కొనియాడారు. ఆ సంఘటనపై నిర్మాత అశ్వనీదత్ శుక్రవారం సోషల్ మీడియా వేదికగా స్పందించారు. అసలు అమితాబ్ ఆ రోజు ఈవెంట్‌లో అలా చేస్తారని తాను ఊహించలేదని చెప్పారు. 'నేను తేరుకొని ఆయనకు ప్రతి నమస్కారం చేయడానికి కొంచెం సమయం పట్టింది. అమితాబ్‌బచ్చన్ భారతీయ సినిమా యోధుడు ఎంత ఎదిగినా ఒదిగి ఉండే ఆయన వ్యక్తిత్వానికి మరోసారి అభివందనం చేస్తున్నా'నని తెలిపారు.

బుజ్జిమేక.. బుజ్జిమేక



గ్రామీణ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'పొట్టేల్'. యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల ముఖ్య పాత్రధారులు. సాహిత్ మోత్కూరి దర్శకుడు. ఇప్పటి వరకూ విడుదలైన మూడు పాటలు ప్రేక్షకుల్ని అలరించాయి. తాజాగా నాలుగో పాటను శుక్రవారం విడుదల చేశారు. 'బుజ్జి మేక.. బుజ్జిమేక' అంటూ సాగే ఈ పాటను కాసర్ల శ్యామ్ రాయగా, కాలభైరవ పాడారు. శేఖర్‌చంద్ర స్వర పరిచారు. పాటలో విజువల్స్ ఆకట్టుకొనేరీతిలో ఉన్నాయి. హార్ట్ టచింగ్ సాంగ్‌గా దర్శకుడు చిత్రీకరించారు. అజయ్, ప్రియాంక శర్మ, తనస్వి చౌదరి, నోయల్ సీన్, ఛత్రపతి శేఖర్, శ్రీకాంత్ అయ్యంగార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిశాంక్ రెడ్డి కుడితి, సురేశ్‌కుమార్ నడిగే నిర్మాతలు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/DiKTPSo లో చదవండి.


వెంకటపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న చంద్రబాబునాయుడు

ఎన్టీఆర్‌కు నివాళి

తుళ్లూరు, జూనఖ 21: ఎప్పటిలాగే వెంకటపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూల దండల వేసి నివాళి అర్పించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం అసెంబ్లీలో అడుగు పెట్టారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు, మంత్రులకు వెంకటపాలెం గ్రామస్తులు, అమరావతి రైతులు ఘనస్వాగతం ఏర్పాటు చేశారు. నారా చంద్రబాబు నాయుడు అను నేను.. అని పూలతో అలంకరించారు. జై బాబు, జైజై బాబు అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. మంత్రి అచెన్నాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, కూటమి ఎమ్మెల్యేలు చంద్రబాబు నాయుడితో పాటు ఎన్టీఆర్‌కు నివాళి అర్పించి అసెంబ్లీకి వెళ్లారు.

రైలు నుంచి జారి వ్యక్తి మృతి


ట్రాక్ పక్కన పడి ఉన్న మృతదేహం

తెనాలి క్రైం, జూన్ 21: విజయవాడ నుంచి తిరుపతి వెళుతూ రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన చుండూరు రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. తెనాలి రైల్వేపోలీసులు శుక్రవారం తెలిపిన వివరాల మేరకు చుండూరు రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని మృతదేహం పడిఉందన్న సమాచారంతో వెళ్లి పరిశీలించగా సుమారు 40-45సంవత్సరాల వయసుగల గుర్తుతెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతిచెందాడు. మృతదేహం వద్ద ఇతర ఆధారాలు లభించకపోవడంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

జడ్పీలో.. జలగలు

- పాతుకుపోయిన వైసీపీ భక్త బృందం!
- సాధారణ బదిలీలలో భారీ మార్పులు ఉండే అవకాశం
- ముఖ్య అధికారులకు తప్పని స్థాన చలనం

గుంటూరు సిటీ, జూన్ 21: గుంటూరు జిల్లా పరిషత్‌లో కొందరు ఉద్యోగులకు ఇంకా వైసీపీ మత్తు వదల్లేదు. పాత ప్రభుత్వమే అధికారంలో ఉందన్న భ్రమలో విహరిస్తున్నారు. గడచిన ఐదేళ్ల కాలంలో వైసీపీ నేతలను అడ్డం పెట్టుకుని బదిలీలు కాకుండా పాతుకుపోయిన వారంతా ఆ మేరకు స్వామి భక్తిని ప్రదర్శిస్తూనే వున్నారు. ఇక్కడ దీర్ఘకాలికంగా పాతుకుపోయిన ఉద్యోగులు ఒక కోటరీగా మారి జిల్లా పరిషత్‌కు సంబంధించిన అనేక ముఖ్య విషయాల్లో చాలా గోప్యత పాటిస్తున్నారు. ప్రభుత్వం మారినా ఇంకా అదే మూస ధోరణిలో జడ్పీ ఉద్యోగులు వ్యవహరిస్తూ ఉండటం మిగిలిన వారిలో అసహనం కలిగిస్తోంది. ఎన్నికల సమయంలో వైసీపీకి పూర్తి అనుకూలంగా పనిచేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు సైతం కీలక స్థానాల్లో ఉండటం పట్ల పలువురు ఉద్యోగులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద త్వరలో జరగనున్న సాధారణ బదిలీల్లో జిల్లా పరిషత్ పూర్తి ప్రక్షాళన జరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

ఎక్కువ మంది వాళ్లే...

ఒకప్పుడు జిల్లా పరిషత్‌లో ప్రభుత్వం ఏదైనా అన్ని వర్గాలకు చెందిన ఉద్యోగులు వుండే వారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక పాత పద్ధతికి పాతర పడింది. టీడీపీకి చెందిన వారని ముద్ర వేసి మరీ చాలామంది ఉద్యోగులను బదిలీ చేశారు. ఎమ్మెల్యేలు చెప్పారన్న సాకుతో చివరకు మహిళా ఉద్యోగులను కూడా సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారు. అర్హత లేనప్పటికీ వైసీపీ అనుకూల ఉద్యోగులను అందలం ఎక్కించారు. మూడేళ్ళ గడిచి బదిలీకి అవకాశం ఉన్నప్పటికీ టీడీపీ సానుభూతి పరులుగా ముద్ర పడిన ఉద్యోగులను గుంటూరు జడ్పీకి రాకుండా అడ్డుకున్నారు. సామాజిక వర్గం ఆధారంగా జిల్లా పరిషత్ ఉద్యోగులకు పార్టీలు అంటకట్టి సుదూర ప్రాంతానికి బదిలీచెయ్యటం గత ప్రభుత్వంలో యధాలాపంగా జరిగిపోయింది.

ఆడిందే ఆట.....

ఐదేళ్ల పాటు జడ్పీలో పాతుకుపోయిన వైసీపీ అనుకూల వర్గం జడ్పీలో వున్న పాత పదకధతులకు పూర్తిగా పాతర వేసింది. ఒక ముఖ్య అధికారి చాలా రోజులపాటు అన్ని విషయాలను శాసించారు. తనకు అనుకూలంగా ఉన్న వారిని అన్ని విధాలా సమర్థించి, మిగిలిన వారిని వేధించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయనపై ఎన్నికల సమయంలో కూడా పలు ఆరోపణలు వచ్చాయి. వైసీపీకి అనుకూలంగా లేని ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపణలు వచ్చాయి. మరికొన్ని కీలక విభాగాల్లో ఉన్న అధికారులు కూడా పాత ప్రభుత్వ ప్రజాప్రతినిధులు చెప్పినట్లే అన్నీ చేశారు. నిబంధనలు అతిక్రమించి ఫైళ్లను పరుగులు పెట్టించారు. జడ్పీ ఆదాయ వనరులను వైసీపీ నేతలకు అనుకూలం మార్చారు అన్న ఆరోపణలు ఉన్నాయి. ఎన్ని జరిగినా ఏ విషయం బయటకు పొక్కకుండా చాలా జాగ్రత్తలు పడ్డారు. వైసీపీకి వ్యతిరేకంగా ఉండే పత్రికలకు సరైన సమాచారం కూడా ఇచ్చిన దాఖలాలు లేవు.


కదులుతున్న పీఠాలు

త్వరలో జరగనున్న సాధారణ బదిలీలలో జడ్పీలోని ముఖ్య పీఠాలు కదిలే అవకాశం ఉంది. త్వరలో పదవీ విరమణ పొందే అవకాశం ఉండటంతో ముఖ్య అధికారి వారి సొంత జిల్లాకు వెళ్తే బాగుంటుందన్న ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఆయనపై పార్టీ ముద్ర లేనప్పటికీ తనకు తాను ఈ ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తోంది. మరో అధికారి బదిలీ కోసం కొందరు బలంగా పట్టుపడుతున్నారు. ఆయన వైసీపీకి పూర్తి అనుకూలంగా ఉండి, ఎన్నికల్లో ఆ పార్టీ కి మేలు జరిగే విధంగా పనిచేసినట్లు కొందరు ఇప్పటికే గెలిచిన ముఖ్యనేతల దృష్టికి తీసుకెళ్లారు. ఆయా విభాగాల్లో ఉన్న మరి కొందరు అధికారులను కూడా జడ్పీ నుంచి పంపివేయాలని నేతల వద్ద ప్రతిపాదనలు పెట్టారు. ఈ మేరకు జాబితా ఒకటి తయారు చేసి నేతలకు అందజేసినట్లు సమాచారం. మొత్తం మీద జూలై మాసంలో జడ్పీలో భారీ మార్పులు, చేర్పులు వుండే అవకాశం ఉంది.



శ్రీత్రికోటేశ్వరస్వామికి పాలతో అభిషేకం..

వైభవంగా రుద్రాభిషేకం

ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ దేవస్థానంలో శ్రీ త్రికోటేశ్వర స్వామికి శుక్రవారం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం వైభవంగా జరిగింది. జేష్ఠ పూర్ణిమ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాలతో, విశేష ద్రవ్యాలతో అభిషేకాలు ఘనంగా నిర్వహించారు.
- నరసరావుపేట

మునిసిపల్ డిప్యూటీ ఇంజనీర్ల సర్టిఫికెట్ల పరిశీలన

- 'ఆంధ్రజ్యోతి' కథనం తో అధికారుల్లో కదలిక

గుంటూరు సిటీ, జూన్ 21: పక్క రాష్ట్రాల సర్టిఫికెట్లతో అక్రమంగా ప్రమోషన్‌లు పొందిన మునిసిపల్ ఇంజనీర్లకు సెగ తగులుతుంది. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ఎడిషన్‌లో 'మునిసిపాలిటీల్లో శంకర్‌దాదా' శీర్షికతో ప్రచురితమైన కథనం సంచలనం సృష్టిస్తోంది. 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన మునిసిపల్ శాఖ రాష్ట్ర అధికారులు మొత్తం వ్యవహారంపై విచారణకు ఆదేశించారు. తాజాగా అందరి విద్యార్హతల సర్టిఫికెట్‌లు పరిశీలించాలని ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. పక్క రాష్ట్రాలకు చెందిన సర్టిఫికెట్లుతో ప్రమోషన్ పొందినవారి జాబితా తయారు చేయాలని సూచించినట్లు సమాచారం. తీగ లాగితే డొంక కదిలినట్లు 2008నుంచి మునిసిపాలిటీల్లో జరిగిన అన్ని ప్రమోషన్‌లపై విచారణ జరగనుండటంతో కొందరు ఇంజనీర్లు హడలిపోతున్నారు. ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించిన కొందరు అధికారుల శైలిపై కూడా విచారణ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమోషన్‌లు ఇచ్చే సమయంలో ఉన్న అధికారుల మెడకు కూడా ఈ వ్యవహారం చుట్టుకునే అవకాశం కనిపిస్తోంది.

ఉన్నత విద్యామండలి వద్దన్నా...

వాస్తవానికి మునిసిపల్ ఇంజనీర్ల ప్రమోషన్ వ్యవహారంలో ఉన్నత విద్యామండలి స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. పక్క రాష్ట్రాల నుంచి పొందిన డిగ్రీ లు చెల్లుబాటు కావని స్పష్టంచేసింది. యూజీసీ నిబంధనలకు వ్యతిరేకంగా వున్న యూనివర్సిటీల సర్టిఫికెట్‌లకు విలువలేదని చెప్పినప్పటికీ మునిసిపల్ ఉన్నతాధికారులు వాటిని పట్టించుకోలేదు. జోన్-3 ప్రమోషన్‌ల ప్రక్రియలో ఉన్న తవిద్యామండలి ఆదేశాలను పూర్తిగా పక్కనపెట్టేసి నచ్చినవారికి అందలాలు కట్టబెట్టారు.

పైరవీలు ప్రారంభం

'ఆంధ్రజ్యోతి'కథనంతో ఇబ్బంది వస్తుందని పసిగట్టిన కొందరు అధికారులు అప్పుడే పైరవీలు ప్రారంభించారు. అధికారపార్టీ నేతలను ప్రసన్నం చేసుకునేం దుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. బాధిత ఉద్యోగులు మాత్రం పక్క రాష్ట్రాల సర్టిఫికెట్లతో ప్రమోషన్‌లు పొందినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

తాగునీరు.. కలుషితం

- వాంతులు, విరేచనాలతో 10 మంది దళితకాలనీ వాసులు
- ఇరువురిని జీజీహెచ్‌కి తరలింపు
- నాటి వైసీపీ తప్పిదాలే నేటి సమస్యలు


కాలనీవాసులు తాగింది కలుషితమైన ఈ బోరు నీటినే..

దాచేపల్లి, జూన్ 21: తాగునీరు కలుషితం కావడంతో ఆ నీరు తాగిన దళిత కాలనీవాసులు వాంతులు, విరేచనాలకు గురై ఆసుపత్రి పాలైన ఘటన శుక్రవారం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేశానుపల్లి గ్రామంలోని ఎస్సీకాలనీలో జరిగింది. ఎస్సీ కాలనీలో రెండు బోర్ల నుంచి కాలనీవాసులు తాగునీటికి, ఇతర అవసరాలకు నీటిని వాడుతుంటారు. గత నాలుగు రోజులుగా కాలనీలో వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడుతున్నారు. గ్రామానికి చెందిన వినుకొండ కోటయ్య ఆరోగ్యపరిస్థితి విషమంగా వుండటంతో గుంటూరు తరలించారు. కాలనీలో పదో తరగతి చదువుతున్న శ్రీపతి మెర్సీ, 6వ తరగతి చదువుతున్న మీసాల మౌనిక, వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించే పమ్మి లక్ష్మీ, వింజమూరి కమలమ్మ, వంగూరి నాగమ్మ, వినుకొండ రత్నబాబు, పేరుపోగు జగన్, వుల్లేరు లింగమ్మ, శ్రీపతి భాస్కరరావుతో పాటు దాచేపల్లిలోని అచ్చాలగడ్డలో నివశిస్తున్న యాదలపురం వెంకట నర్సమ్మ, కుమ్మరిబజారులో నివశిస్తున్న మరో ఇద్దరు వాంతులు, విరేచనాలతో ఆసుపత్రి పాలయ్యారు. డయేరియాకు గురై ఆసుపత్రిపాలైన వీరంతా పేదకుటుంబాలకు చెందిన వారే.


ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్న కేశానుపల్లి ఎస్సీ కాలనీవాసులు

ట్యాంక్‌లు శుభ్రం చేయకపోవడమే ప్రధాన కారణం

ఎస్సీ కాలనీలో వున్న బోర్ల నుంచి పైపులైన్ ద్వారా ట్యాంక్‌లకు నీటిని సరఫరా చేయిస్తున్నారు. ఈ ట్యాంక్‌లను సకాలంలో శుభ్రం చేయకపోవడం ప్రధాన కారణంగా కాలనీ వాసులు పేర్కొంటున్నారు. ఈ ట్యాంక్‌ల నుంచి వస్తున్న నీరు రంగు, రుచి మారి దుర్వాసన వెదజల్లుతుంది. అధికారులు తమ కాలనీపై దృష్టి సారించాలని, తమకు మెరుగైన వైద్యం అందించాలని కోరుతున్నారు. గ్రామంలో డయేరియా వ్యాపించిందన్న సమాచారంతో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఇంటింటికి తిరిగి రోగులను గుర్తించి వైద్యసేవలందిస్తున్నారు.


చికిత్స పొందుతున్న మీసాల మౌనిక, శ్రీపతి మెర్సీ, పమ్మి లక్ష్మీ

యరపతినేనికి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సన్మానం


గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును సన్మానిస్తున్న రాష్ట్ర రవాణా శాఖా మంత్రి మండేపల్లి రాంప్రసాద్‌రెడ్డి

పిడుగురాళ్ల, జూన్21: గురజాల శాసనసభ్యునిగా నాల్గవసారి ఎన్నికైన యరపతినేని శ్రీనివాసరావును శుక్రవారం సాయంత్రం గుంటూరులోని ఆయన కార్యాలయంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కడప జిల్లా రాయచోటి శాసన సభ్యుడు, రాష్ట్ర రవాణాశాఖా మంత్రి మండేపల్లి రాంప్రసాద్‌రెడ్డి శుక్రవారం యరపతినేని కార్యాలయంలో ఆయనను కలిసి దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలియజేశారు. టిక్కెట్ కేటాయింపులో యరపతినేని చొరవతోనే తనకు సీటు రావడం జరిగిందని ఈ సందర్భంగా రాంప్రసాద్‌రెడ్డి గుర్తుచేశారు. అనంతరం యరపతినేని శ్రీనివాసరావు కూడా మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని సత్కరించారు.

రాజధాని రైతులపై కేసులను ఉపసంహరించాలి

- అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య తీర్మానం

గుంటూరు, జూన్ 21(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని రైతులపై ఉద్యమం సమయంలో పెట్టిన కేసులను తక్షణమే ఉపసంహరించాలని అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య తీర్మానించింది. శుక్రవారం గుంటూరు నగరంలో సమాఖ్య సమావేశం మాదల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి తీర్మానాలను ఆమోదించి ప్రభుత్వానికి పంపించారు. ఎన్‌డీఏ పాలిత కేంద్ర ప్రభుత్వం నుంచి అమరావతి రాజధానికి అనేక రాయితీలను సాధించాలని, అలానే పెట్టుబడిదారులకు నమ్మకం కలిగించేలా కార్యకలాపాలు చేపట్టాలని మరో తీర్మానం చేసింది. సాధ్యమైనంత త్వరగా ఉమ్మడి వ్యూహాత్మక సమావేశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధ్యక్షతన ఏర్పాటు చేసి అన్ని అంశాలపై కూలంకషంగా చర్చించాలని పేర్కొంది. అమరావతి రాజధాని ఉద్యమంలో అనేకమంది తమ ప్రాణాలను త్యాగం చేశారు. వారి త్యాగాలను చిరస్మరణీయం. అప్పటి ప్రభుత్వం పెట్టిన నరకయాతనతో రైతులు, ప్రజలు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. దీనిని తీవ్రంగా ఖండిస్తూ ఇంకొక తీర్మానాన్ని ఆమోదించింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఘనవిజయం సాధించినందుకు టీడీపీ పాలిత ఎన్‌డీఏ కూటమిని అభినందిస్తూ రాబోయే రోజుల్లో అమరావతి ప్రజానీకానికి మేలు చేకూర్చాలని తీర్మానం ఆమోదించింది. ఈ సమావేశంలో కమిటీ నాయకులు పాల్గొన్నారు.


అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య భేటీలో పాల్గొన్న నేతలు

గుర్తు తెలియని యువకుడి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

చిలకలూరిపేట, జూన్ 21 పట్టణంలోని మునిసిపాలిటీ రోడ్డులో కోర్టుకు సమీపంలో ఒక చెట్టు కింద గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండగా శుక్రవారం ఆ ప్రాంతంలోని కొందరు గుర్తించారు. వెంటనే వారు 108 అంబులెన్స్ వారికి ఈ విషయంపై సమాచారం అందించారు. అతడిని వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందాడని వైద్యులు గుర్తించారు. అతడి వివరాలు తెలిసిన వారు చిలకలూరి పేట అర్బన్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. అతడికి సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉండవచ్చునని భావి స్తున్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలకు త్వరలోనే పరిష్కారం

- మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి

గుంటూరు సిటీ, జూన్ 21: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఆ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి హామీ ఇచ్చారని సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన పత్రికా ప్రకటనలో శుక్రవారం తాడేపల్లిలో మంత్రిని కలిసి తమ సమస్యలను విన్నవించినట్లు తెలిపారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, ఉద్యోగులపై వారి మాతృశాఖ మాత్రమే అజమాయిషీ ఉండేలా చూడాలని కోరామని పేర్కొన్నారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పార్థ మధు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు తాతా వెంకట సాయి మణికంఠ, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు నవీన్, సంఘ ముఖ్య నాయకులు కోరేపు మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగ సంఘం నాయకులు

గడ్డి మందు తాగి కౌలురైతు ఆత్మహత్య


బ్రహ్మయ్య (పాత చిత్రం)

సత్తెనపల్లి రూరల్, జూన్ 21: అప్పుల బాధ తాళలేక కౌలు రైతు గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని అబ్బూరులో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ధూళిపాళ్ళ బ్రహ్మయ్య(45) పదిహేను సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తుంటాడు. ఎకరం సొంత పొలంతో పాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని నాలుగు ఎకరాల్లో మిర్చి, రెండు ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. ప్రతి ఏడాదితో పాటు ఈ ఏడాదితో కూడా పంటలు దెబ్బతినటంతో అప్పులు పేరుకు పోయాయి. సుమారు రూ.20 లక్షలు అప్పు కావటంతో అది తీర్చే మార్గం లేక పోవటం, అప్పు ఇచ్చిన వారు ఒత్తిడి తేవటంతో మనస్థాపానికి గురై గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. తెల్లవారు జామున పొలం వెళ్ళిన కుటుంబ సభ్యులకు బ్రహ్మయ్య అపస్మారక స్థితిలో పడటం గమనించి హుటాహుటిన సత్తెనపల్లిలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ బ్రహ్మయ్య మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సంఘటన పై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసుల్లో నిందితుడికి జైలు శిక్ష

నరసరావుపేట లీగల్, జూన్ 21: వేర్వేరు చోరీ కేసులు నిరూపణ అ వ్వటంతో నిందితుడు ప్రకాశం జిల్లా బల్లికురవకు చెందిన షేక్ నాగూర్ బాషాకు మూడు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రవలిక శుక్రవారం తీర్పు వెలువరించారు. కేసులు నమోదు చేసుకున్న మొదటి పట్టణ పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేసి రెండు కేసుల్లో నిందితుడిగా నిర్ధారించి రిమాండ్‌కు తరలించారు. విచారణలో నేరాలు రుజువవ్వటంతో పై విధంగా కోర్టు తీర్పు వెలువడింది. ప్రాసిక్యూషన్‌ను ఏపీపీ లక్ష్మీరామ్ నాయక్ నిర్వహించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	140, 149,160
చికెన్ విత్ స్కిన్	268.00
చికెన్ స్కిన్ లెస్	278.00

48,825 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూన్ 21(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 43,236 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 48,825 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 12,490 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	17000
నెంబరు. 5	10000	15000
273	9500	16000
341	8500	16000
4884	13000	13000
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	20000
బ్యాడిగి	9000	15500
దేవనూరుడీలక్స్	9000	15500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
తెల్లకాయలు	4000	12500
ఏసీ కామన్ వెరైటీ		
334	8500	18000
273	9500	16000
341	10000	17000
4884	14000	18000
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	9500	20000
బ్యాడిగి	10000	15000
దేవనూరుడీలక్స్	11000	13000
తెల్లకాయలు	5000	12000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



కారంపూడిలో 'నేను బడికి పోతా..'ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈవో రవికుమార్

'నేను బడికిపోతా' అవగాహన ర్యాలీ

కారంపూడి, జూన్ 21: మండల కేంద్రమైన కారంపూడిలో శుక్రవారం ఎంఈవో రవికుమార్ ఆధ్వర్యంలో 'నేను బడికిపోతా..' కార్యక్రమంలో భాగంగా పురవీధుల్లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. 6 నుంచి 14 సంవత్సరాలలోపు విద్యార్థులు తప్పనిసరిగా పాఠశాలలో ఉండాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపాలన్నారు. కార్యక్రమంలో బ్రహ్మనాయుడు హైస్కూల్ హెచ్‌ఎం అనంతశివ, ఈవోపీఆర్డీ సత్యప్రసాద్ పాల్గొన్నారు.

నకరికల్లు: బడి ఈడు పిల్లలంతా బడిలోలా హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు తగు చర్యలు తీసుకోవాలని ఎంఈవో ఎంఎల్ఎస్ ప్రసాదు కోరారు. శుక్రవారం ఎంఈవో కార్యాలయంలో 'నేను బడికి పోతా..' కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బడి బయటవున్న పిల్లలందరినీ గుర్తించి వారిని బడిలో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని,వారికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించాలని ఎంఈవో హెచ్‌ఎంలు, సీఆర్‌పీలను ఆదేశించారు. బడిలో చేర్పించటంలో నిర్లక్ష్యం వహించేవారి పై ఉన్నతాధికారులకు చర్యలు సిఫార్స్ చేయనున్నట్లు తెలిపారు.

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించాలి

సత్తెనపల్లి, జూన్ 21 : చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఐద్వా పల్నాడు జిల్లా ఉపాధ్యక్షురాలు గద్దె ఉమశ్రీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పుతుంబాక భవన్‌లో ఐద్వా జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ అత్యాచారాలకు గురైన మహిళలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా విడుదల చేయటమే కాకుండా ఆయా ఘటనల్లోని నిందితులను అరెస్టు చేసి వేగంగా శిక్షలు పడేలా చూడాలని ప్రభుత్వాన్ని కోకారు. అంగన్‌వాడీలను రాజకీయ వేధింపుల నుంచి కాపాడాలన్నారు. సమావేశంలో గుంటుపల్లి రజినీ, స్పందన, అనూష, సుజాత, పద్మ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

భక్తాంజనేయ స్వామికి పూజలు

సత్తెనపల్లి, జూన్ 21 : పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో గల శ్రీ భక్తాంజనేయ స్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాభావ పరిస్థితులు తొలగి వర్షాలు పడి ప్రజలంతా సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో స్వామి వారికి 108 కలశాలతో పంచామృత సహిత విశేష జలాభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని సందర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చక స్వామి వేదాన్తం విజయ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.



మాచవరంలో స్వీట్స్ పంపిణీ చేస్తున్న ముస్లింలు

కూటమి ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం సందర్భంగా

ముస్లింల ప్రార్థనలు.. మిఠాయిల పంపిణీ

మాచవరం, జూన్ 21: శాసనసభలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావులు ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా మండల కేంద్రమైన మాచవరంలో శుక్రవారం టీడీపీ ముస్లింలు మిఠాయిలు పంపిణీ చేశారు. ముందుగా గురజాల నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా ఆధ్వర్యంలో మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు సయ్యద్ రహీం, అబ్బాస్ అలీ, దావల్సా, ఉల్లిగడ్డ సైదా, మస్తాన్‌బుడే, అల్లాభక్షు, ఖలీల్, షరీఫ్, జనసేన నాయకులు పండు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

నకరికల్లు, జూన్ 21 : చల్లగుండ్లలో వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తృతీయ వార్షికోత్సవం పురస్కరించుకొని స్వామి వారి కళ్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

23న కొమెరపూడిలో ఉచిత వైద్య శిబిరం

సత్తెనపల్లి రూరల్, జూన్ 21: ఆస్టర్ రమేష్ హాస్పటల్ గుంటూరు ఆధ్వర్యంలో మండలంలోని కొమెరపూడిలో ఈనెల 23న ఆదివారం ఉచిత మెగా సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు హాస్పటల్ గ్రూపు బిజినెస్ డెవలప్‌మెంట్ అధికారి డాక్టర్ కార్తీక్‌చౌదరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిబిరానికి హాజరయ్యే వారు తమ పాత వైద్య రిపోర్టులను తీసుకు రావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9700012398, 8886911511 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

రేషన్‌షాపు డీలర్‌షిప్ విషయంలో వివాదం

- రాళ్లు, కర్రలతో ఇరువర్గాల ఘర్షణ..
- పలువురికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రి తరలింపు

సత్తెనపల్లి రూరల్, జూన్ 21: రేషన్‌షాపు దక్కించుకొనే విషయంలో ఇరువర్గాల మధ్య ఏర్పడిన వివాదం ఘర్షణకు దారితీసిన ఘటన మండలంలోని ధూళిపాళ్ల పంచాయతీ పరిధిలోని భాగ్యనగర్ కాలనీలో గురువారం అర్థరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో రేషన్ షాపు డీలర్‌షిప్ తీసుకొనే విషయంలో గాడిదపాటి చిన్నబ్బాయి, చిలకా అశోక్ వర్గీయుల మధ్య వివాదం తలెత్తింది. ఇది కాస్త పెద్దదై ఘర్షణకు దారి తీసింది. ఒకరిపై ఒకరు రాళ్ళు విసురుకొని కర్రలతో దాడి చేసుకున్నారు. ఈ దాడుల్లో ఒక వర్గానికి చెందిన గాడిదపాటి అప్పమ్మ, రాజేష్, అశోక్, శ్యాంసన్ తీవ్ర గాయాలుకాగా, మరియబాబు, చిరంజీవిలకు స్వల్పగాయాలయ్యాయి. మరో వర్గానికి చెందిన చిలకా వీరయ్య, అశోక్, అశ్వనిలకు గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తరలించారు. ఈ ఘటనపై ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ పోలీసులు శుక్రవారం తెలిపారు.

యోగాతో ఆరోగ్యం పదిలం

- శారీరక, మానసిక సమస్యలకు చక్కటి పరిష్కారం
- అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రముఖుల ఉద్ఘాటన
- వివిధ సంస్థలు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు



సత్తెనపల్లి మార్కెట్ యార్డులో యోగాసనాలు చేస్తున్న జడ్జి, న్యాయవాదులు

మాచర్ల రూరల్, జూన్ 21: పట్టణంలోని జూనియన్ సివిల్ జడ్జి కోర్టులో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జూనియర్ సివిల్ అడిషనల్ న్యాయాధికారి శ్రీరామ్ శ్రీనివాస్ కల్యాణ్ యోగా ప్రాధాన్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ యోగా చేస్తూ ఈర్ష్యా అసూయ, శరీరరుగ్మతలను తొలగించుకొని సంపూర్ణ మానసిక వికాసంతో జీవించాలన్నారు. అనంతరం మండల న్యాయ సేవా కమిటి సభ్యుడు మెట్టు గోవిందరెడ్డి యోగాసనాలు, సూర్య నమస్కారాలు, మెడిటేషన్‌పై వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది జీవీ, గౌస్‌బాషా, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి : మనిషికి మానసిక వికాసాన్ని, శారీక ధృడత్వాన్ని యోగా పెంపొందిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని న్యాయాధికారులు, న్యాయవాదుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. యోగా దినోత్సవ ప్రాధాన్యం, యోగా సాధనతో వలన కలిగే ఉపయోగాల గురించి సీనియర్ సివిల్ జడ్జి వివరించారు. కార్యక్రమంలో న్యాయాధికారులు పీ.హాస్సేన్, పీ.ప్రియదర్శిని, మహమ్మద్ గౌస్‌తో పాటు న్యాయవాదులు ఉన్నారు.

అలాగే హోలీ ఫ్యామిలీ ఇంగ్లీషు మీడియం స్కూల్, సుగాలీ కాలనీ జడ్పీ హైస్కూల్లోనూ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. స్వామి వివేకానంద చైతన్య భారతీ సభ్యుడు జేపీఎస్ శాస్త్రి విద్యా ర్థులచే యోగా చేయించారు. కార్యక్రమంలో పొట్టి సాంబశివరావు, లతా ప్రియదర్శిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్తెనపల్లిరూరల్ : మండలంలోని నందిగామ జడ్పీ హైస్కూల్లో జిల్లా క్రీడాభారతి ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు యోగాసనాలువేశారు. కార్యక్రమంలో క్రీడాభారతి పల్నాడు జి.ల్లా కార్యదర్శి పీ శివరామకృష్ణ, పాఠశాల హెచ్‌ఎం కాకరపర్తి శ్రీనివాసరావు, పాఠశాల పీడీ పిచ్చయ్య, సురేష్, వెంకటేశ్వరరావు, అనీల్ దత్తానాయక్ పాల్గొన్నారు. మండలంలోని కట్టావారిపాలెంలో నిర్వహించిన యోగా దినోత్సవంలో ఎంపీడీవో జగదీష్, ఎంఈవో శ్రీనివాసరావు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో వెంకటనారాయణ, టీడీపీ నాయకులు యోగాసనాలు వేశారు.

నకరికల్లు : నకరికల్లు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగా డే ఆకృతిలో విద్యార్థినులు ప్రదర్శించిన విన్యాసం ఆకట్టుకుంది. అనంతరం బాలికలు యోగాసనాలు పదర్శించారు. యోగా సాధన ద్వారా మానసిక ప్రశాంతత, శారీరక సమతుల్యత సాధించ వచ్చునని ప్రిన్సిపాల్ కొండవీటి లక్ష్మి తెలిపారు.

దుర్గి: స్థానిక జడ్పీహెచ్‌ఎస్‌లో ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేపీ నేతలు, కార్యకర్తలు పలువురు యోగాసనాలు వేశారు. ప్రతి ఒక్కరూ క్రీడలతో పాటు యోగాసనాలను అలవర్చుకోవాలని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రసాద్ సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెలిదండి శ్రీనివాసరావు, బీజేపీ మండల ఇన్‌చార్జి పువ్వాడ శ్రీనివాసరావు, నాగెండ్ల మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతల : ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గిరిజన సంక్షేమ పాఠశాలలో విద్యార్థులు యోగసానాలు సాధన చేశారు. యోగశాస్త్రంలో ప్రాణాయానికి ప్రత్యేక స్థానం ఉందని ఎంపీడీవో శంకరావు అన్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీవో జయచంద్ర, ఎంఈవో శివనాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ మోహనరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లి: నారాయణపురంలోని యోగ విజ్ఞాన కేంద్రం, తంగెడలోని డీఏవీ స్కూల్‌లలో యోగా క్లాసులు నిర్వహించారు. కార్యక్రమంలో గాదె రామకృష్ణారెడ్డి, నర్రా పుల్లయ్య, బొడ్డు నాగేశ్వరరావు, అక్కిరాజుమాస్టర్, యర్రంశెట్టి గోపినాద్, తెలనాకుల సత్యానారాయణ, అంబటి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

గురజాలటౌన్ : వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో విద్యార్థులు యోగా ఆసన ప్రదర్శన నిర్వహించారు. సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఎంతో దోహదపడుతుందని యోగా ఉపాధ్యాయుడు లేళ్ల పుల్లారావు అన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బడిదెల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కిషోర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఆర్ స్వప్న, సీతారాములు తదితరులు పాల్గొన్నారు. దైదలో టీడీపీ నేతలు యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడు : పెదకూరపాడులోని జడ్పీ హైస్కూల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో ఏకుల ప్రసాదరావు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో యోగా తరగతులు నిర్వహించాలని, యోగా సాధనతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ప్రధానోపాధ్యాయులు కాకాణి వెంకటరమణ అన్నారు. కార్యక్ర మంలో అమరావతి కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు నల్లూరి రాంబాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు సీహెచ్‌వీ నాగరాజు, ఎంఈవో సత్యనారాయణరావు, బీజేపీ మండల అధ్యక్షుడు పీ.శ్రీని వాసరావు, గోగినేని వెంకట రమణ, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేట జడ్పీ హైస్కూల్లో విద్యార్థుల యోగాడే విన్యాసం

అమరావతి: స్థానిక ధ్యానబుద్ధ ప్రోజెక్టు సమీపంలోని బుద్ధవనం లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు, విద్యార్థులు పాల్గొని యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎం.హను మంతరావు, బీజేపీ పల్నాడుజిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్ బాబు, జిల్లా కాపునాడు అధ్యక్షులు పోలిశెట్టి వెంకటసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక యోగాశ్రమం, సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

అచ్చంపేట: స్థానిక జడ్పీ హైస్కూల్లో విద్యార్థులచే ఆసనాల ప్రదర్శనలో భాగంగా యోగాడే అనే అక్షరాల ఆకారంలో ప్రదర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని చిగురుపాటి కళ్యాణి యోగా విశిష్టత గురించి వివరించారు. జాతీయ స్థాయిలో యోగా పోటీల్లో బంగారు బహుమతి పొందిన రాయిడి అజయ్‌కుమార్‌ను సత్కరించినట్టు పాఠశాల పీడీ డాక్టర్ ఆలపాటి సుజాత తెలిపారు. స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో యోగాడేను బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే శ్రీ వాసవి క్లబ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు.

క్రోసూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో యోగా గురువు, ఈవోఆర్డీ పీ.సీతారామయ్య ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఇతర ఉద్యోగులు యోగాసనాలు సాధన చేశారు. పీసపాడులోని అమృత సరోవర్ ప్రాజెక్టు వద్ద స్థానికులు యోగా ఆసనాలు వేశారు. ఈ సంద్భంగా యోగా సాధనతో కలిగే ప్రయోజనాలను వివరించారు.



పెదకూరపాడు జడ్పీ హైస్కూల్లో యోగా చేస్తున్న ఎంఈవో తదితరులు



అమరావతి ధ్యానబుద్ధ ప్రాజెక్టు వద్ద యోగా డేలో పాల్గొన్న ప్రముఖులు

కూటమి నేతల సంబరాలు

మాచర్లటౌన్, జూన్ 21: మాచర్ల నియోజకవర్గ శాసనసభ్యుడిగా జూలకంటి బ్రహ్మారెడ్డి శుక్రవారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో కూటమి నేతలు సంబరాలు జరుపుకున్నారు. వెంకటేశ్వర థియేటర్ ప్రాంతంలో కేక్‌ను కట్ చేసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శివారెడ్డి, దుర్గారావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, శ్రీహరి పాల్గొన్నారు.

సత్తెనపల్లి: అసెంబ్లీలో శుక్రవారం కన్నా లక్ష్మీనారాయణ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారంచేసిన సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు మద్ది వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు, టీడీపీ నేతలు స్వీట్లు పంపిణీ చేశారు. కన్నా లక్ష్మీనారాయణ 6వ సారి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయటం సంతోషమన్నారు. కార్యక్రమంలో చౌట శ్రీనివాసరావు, పోతుగంటి రామకోటేశ్వరరావు, దివ్వెల శ్రీనివాసరావు, చెంచయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్లటౌన్, జూన్ 21: మాచర్ల సబ్ డివిజన్ పరిధిలోని రెంటచింతల, వెల్దుర్తి, దుర్గి, మాచర్ల పట్టణలోని రింగురోడ్డు, మండలంలోని తాళ్లపల్లి గ్రామాల్లోని 33బై11కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ రామయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

విత్తన దుకాణాల్లో తనిఖీ

దాచేపల్లి, జూన్ 21: దాచేపల్లిలోని విత్తన దుకాణాల్లో శుక్రవారం వ్యవసాయశాఖ ఏవో పాపకుమారి, జిల్లా వ్యవసాయశాఖ అధికారులు రవికుమార్ తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్‌లను, నిల్వలను పరిశీలించారు. డోర్స్ ఆఫ్ సర్టిఫికెట్ లేకుండా విత్తనాలు అమ్మటానికి వీలులేదని ఆదేశించారు.

పిడుగురాళ్ల: జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయ సహాయ వ్యవసాయ సంచాలకులు రవికుమార్, పిడుగురాళ్ల ఏడీఏ బత్తుల శ్రీకృష్ణదేవరాయలు శుక్రవారం పిడుగురాళ్లలోని విత్తనాల షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాకు నిల్వలు, రికార్డులను పరిశీలించారు. విత్తనాలను అధిక ధరలకు అమ్మితే లైసెన్స్ రద్దు చేయడంతోపాటు కేసునమోదు చేస్తామని ఏడీఏ హెచ్చరించారు. తెలిపారు. ప్రస్తుతానికి పత్తి, మిరప, కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు అందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

అమ్మవారి ఆలయానికి పాదయాత్ర

మాచర్ల రూరల్, జూన్ 21: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, మాచర్ల ఎమ్మెల్యేగా జూలకంటి బ్రహ్మారెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందడంతో మాచర్ల మండలం భైరవునిపాడుకు చెందిన టీడీపీ నేతలు షేక్ సాధిక్‌వలి, ఈశ్వర్, రాజేష్‌లు శుక్రవారం గ్రామం నుంచి దుర్గి మండలం అడిగొప్పులలోని నిదానంపాటి అమ్మవారి ఆలయానికి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు.

టీడీపీలోనే బ్రాహ్మణులకు సముచిత స్థానం

- దాచేపల్లి గాయత్రి బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు
- సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే యరపతినేని చిత్రపాటలకు క్షీరాభిషేకం

దాచేపల్లి, జూన్ 21: బ్రాహ్మణుల ఆర్థిక బలోపేతానికి సముచిత స్థానం కల్పించింది టీడీపీయేనని దాచేపల్లి గాయత్రి బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు తెలిపారు. శుక్రవారం ఆర్అండ్‌బి బంగ్లాలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే యరపతినేని చిత్రపటాలకు సమాఖ్య నేతలు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘం నాయకులు, టీడీపీ నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బ్రాహ్మణులకు ప్రత్యేకమైన కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు టీడీపీ కృషి చేసిందన్నారు. ఆలయాల్లో అర్చకులకు అందిచే గౌరవ వేతనాన్ని రూ. 5వేల నుంచి రూ. 10 వేలకు కూటమి ప్రభుత్వం పెంచడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో సమాఖ్య నేతలు తంగెడ నాగేశ్వరరావు, కారంపూడి జగన్మోహనాచార్యులు, దుగ్గిరాజు కేశవరావు,



నేతల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న బ్రాహ్మణసంఘ సభ్యులు

పోతురాజు ప్రసాదరావు, పల్లి శ్రీనివాసశర్మ, తంగెడ వీరేశ్వరరావు, నరేంద్రచార్యులు, తిరుమలాచార్యులు, శ్రీకాంతాచార్యులు, దొంతరాజు ప్రసాదరావు, టీడీపీ నేతలు మునగా నిమ్మయ్య, నర్రా పుల్లయ్య, అంబటి శేషగిరిరావు, పగడాల భాస్కరరావు, వేముల కృష్ణ, అక్కినపల్లి బాలయ్య, వేముల తిరుమలకుమార్, ముశ్యం శ్రీనివాసరావు, నాయబ్ అబ్దుల్లా, షేక్ అహ్మదా, రాఘవ, బుజ్జి, తదితరులు పాలాభిషేకంలో పాల్గొన్నారు.



ఎంపీ శ్రీకృష్ణదేవరాయులుతో దుర్గి మండల కూటమి నేతలు

వరికపూడిశెల ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయాలి

- ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలును కోరిన టీడీపీ శ్రేణులు

దుర్గి, జూన్ 21: వరికపూడిశెల ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని నరసరావుపేట ఎంపీగా లావు శ్రీకృష్ణ దేవరాయలను కూటమి నేతలు కోరారు. నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా అఖండ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా శుక్రవారం కూటమి నేతలు ఎంపీని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో మాజీ సర్పంచ్ యెల్లెబోయిన గోపాల్, జక్కా కొండలు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల దాసు, మాగులూరి నారయ్య, కోట వీరయ్య చౌదరి, కటకం రామారావు, జక్కా రమేష్ తదితరులు ఉన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. ముగ్గురికి గాయాలు

బెల్లంకొండ, జూన్ 21 : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు గాయాలపాలైన సంఘటన శుక్రవారం మండలంలోని చంద్రాజుపాలెం-పాపాయపాలెం మధ్యలో జరిగింది. ఈప్రమాదంలో చలపతినాయక్‌కు తీవ్ర గాయాలు కాగా తిరుపతమ్మ, సువార్తలకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. చలపతినాయక్ బెల్లంకొండ మండలం పాపాయపాలెం గ్రామం నుంచి వస్తుండగా అదే సమయంలో రామాంజీ పురం గ్రామం నుంచి సువార్త, మరొక వ్యక్తి ద్విచక్ర వాహనంపై వస్తూ చలపతి నాయక్ ద్విచక్ర వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి ఢీ కొట్టింది. ఈ ఘటనలో చలపతినాయక్‌కు తీవ్ర గాయాలు కాగా, తిరుపతమ్మ, సువార్తలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆలయ భూములకు వేలం.. రూ. 3.87 లక్షల ఆదాయం

నకరికల్లు, జూన్ 21 : నకరికల్లులోని లక్ష్మీనరసింహ స్వామి దేవాలయానికి చెందిన 10.30 ఎకరాలకు నరసరావుపేటలో శుక్రవారం వేలం నిర్వహించగా రూ 3,86,700 ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో వై.వెంకయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన వేలంలో 9.90 ఎకరాలకు సంవత్సరానికి రూ.1.42 లక్షల ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు.

కౌలుదారుని హక్కుపత్రాలపై అవగాహన

మాచవరం, జూన్ 21: మండలంలోని కొత్తగణేశునిపాడు గ్రామంలో కౌలుదారుని హక్కుపత్రాలపై శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ అసిస్టెంట్ సతీష్ మాట్లాడుతూ పొలం కౌలుకు చేసే ప్రతిఒక్క రైతు రెవెన్యూ శాఖ వారు జారీచేసే పంట సాగు హక్కు కార్డు పొందాలని రైతులకు సూచించారు. ఈ కార్డు వలన పంటను మద్దతు ధరకు అమ్ముకునేందుకు, బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలు ఈ కార్డుదారునికి వర్తిస్తాయన్నారు. ప్రతి ఒక్క కౌలుదారుడు రైతు పొలం పాస్ బుక్ జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్ తదితర వాటిని తీసుకొని ఆయా గ్రామాల వ్యవసాయశాఖ అధికారులను, వీఆర్వోలను సంప్రదించాలని తెలియజేశారు. కార్యక్రమంలో వీఆర్వో, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

నకరికల్లు: కౌలుకు పొలాలను సాగు చేసే రైతులందరూ సీసీఆర్‌సీ కార్డులు పొందాలని ఏవో కే.దేవదాసు కోరారు. శుక్రవారం నకరికల్లు గ్రామంలో కౌలు రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. కౌలు రైతులంతా కౌలు రైతు గుర్తింపు కార్డులు పొందాలని సూచించారు.



డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఇఫ్కో మేనేజర్లు

ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన

అమరావతి, జూన్ 21: మండల పరిధిలోని నరుకుళ్లపాడు పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఇఫ్కో సంస్థ ప్రతినిధులు రైతులకు ఎరువుల వినియోగంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. నానో ఎరువులు వినియోగం ద్వారా కాలుష్య నివారణ, పంట అధిక దిగుబడి వస్తుందని ఇఫ్కో సీనియర్ ఎగ్జిగిటివ్ డైరక్టర్ నకుల్ పాఠక్ తెలియజేశారు. రాష్ట్ర మార్కెటింగ్ మేనేజరు టీ.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నానో ఎరువుల కొనుగోలు ద్వారా రైతులకు ఉచిత బీమా సౌకర్యం లభిస్తుందన్నారు. సహకార సంఘాలకు ఇఫ్కో డ్రోన్‌ను మంజూరు చేస్తామన్నారు. ఈ డ్రోన్‌ల ద్వారా మందులు పిచికారీ చేయడం వలన తక్కువ ఖర్చుతో పాటు సమయం కలసి వస్తుందని తెలిపారు. కార్యక్రమానికి సొసైటీ సీఈవో ఎం. వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఇఫ్కో మేనేజరు కే.లోకేశ్, వీ.రఘు సురేంద్ర, మునగోడు పీఏసీఎస్ సీఈవో సాంబశివరావు, నరుకుళ్లపాడు పీఏసీఎస్ మాజీ చైర్మన్ వై .రామకృష్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి

- నేడు ఎంపీతో కలసి కలెక్టరు వద్దకు ..

అచ్చంపేట, జూన్ 21 : మండలంలోని గ్రంథసిరి, ఓర్వకల్లు, విప్పర్ల గ్రామాలకు చెందిన రైతులు తమ సమస్యలను విన్నవించడానికి ఎంపీ కృష్ణ దేవరాయలతో కలసి శనివారం కలెక్టరును కలువనున్నారని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కిలారి రాజన్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అంబడిపూడి వద్ద కృష్ణానదిపై నిర్మించిన సత్తెమ్మతల్లి లిఫ్ట్ ఇరిగేషన్ కింద గ్రంధసిరి, ఓర్వకల్లు, విప్పర్ల గ్రామాల రైతుల భూములు సుమారు వెయ్యి ఎకరా లకు పైగా సాగవుతున్నాయి. గతేడాది 800 ఎకరాలకు ఇప్పటి అడహాక్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులపై రైతుల వద్దనుంచి ఎకరాకు రూ.5వేలు చొప్పున అక్రమంగా వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయన్నారు. ఈ ఏడాది పొలాలకు నీరివ్వమని, రైతులు ఎవ్వరూ పంటలు వేయవద్దని అడహాక్ కమిటీ సభ్యులు అంటున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. దీంతో ఎత్తిపోతల పథకం కింద సుమారు 800 ఎకరాలు మిర్చి రైతుల పరిస్థితి సందిగ్ధంలో పడిందన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ నిర్వాహణపై కోర్టులో కేసు ఉందని, ఈ పరిస్థితుల్లో రైతులకు నీరు ఇవ్వాలని, లేకుంటే నిర్వాహణ రైతులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై స్థానిక ఎంపీతో కలిసి కలెక్టరుని కలువనున్నట్లు రాజన్‌బాబు తెలిపారు.

పాఠశాలల్లో ప్రవేశాలు పెరగాలి

బెల్లంకొండ, జూన్ 21 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు బాగా పెరిగేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈవో రాజకుమారి సూచించారు. శుక్రవారం బెల్లంకొండ ఎంఈవో కార్యాలయంలో 'నేను బడికి పోతా..' కార్య క్రమంలో భాగంగా ఎంపీడీవో, తహ సీల్దార్‌లు ఆయా పాఠశాలల ప్రధా నోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆరు నుంచి 14 సంవత్సరాలు కలిగి బడి బయట ఉండే బాల బాలికలను పాఠశాలలో చేర్పించాలని సూచించారు. సమావేశంలో ఈవో - 2 బాల సుందర రావు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఇతర అధికారులు

అతిసార వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్ శ్రీకేష్ బీ లత్కర్

నరసరావుపేట లీగల్, జూన్ 21: విస్తృతంగా స్టాప్ డయేరియా క్యాంపైన్ చేపట్టాలని, అతిసార కేసులు వ్యాప్తి చెందకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బీ లత్కర్ శుక్రవారం పేర్కొన్నారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్‌హాల్ నుంచి శుక్రవారం మధ్యాహ్నం అతిసార కేసులవ్యాప్తి తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టరేట్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాదు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అతిసార వ్యాప్తి నిరోధంపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లాలోని కలెక్టరేట్‌లోని ఎస్సీ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శ్రీకేష్ బీ లత్కర్, జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాదు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సీఎన్‌జీ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లత్కర్

జిల్లాలో తొలి సీఎన్‌జీ స్టేషన్

● నరసరావుపేటలో ప్రారంభించిన కలెక్టర్ శ్రీకేష్

నరసరావుపేట, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే తొలి సీఎన్‌జీ స్టేషన్‌ను నరసరావుపేటలోని కలెక్టరేట్ ప్రాంగణంలో నెలకొల్పారు. రూ.1.50కోట్ల వ్యయంతో సీఎన్‌జీ స్టేషన్‌ను కలెక్టరేట్‌లోని రెవెన్యూ ఇంధన బంకులో ఐ.ఓ.సి.యల్ ఏర్పాటు చేసింది. ఈ స్టేషన్‌ను కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లత్కర్ శుక్రవారం ప్రాంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్ని సి.యన్.జి వాహనాలు ఉన్నాయి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. తదుపరి ఫిల్లింగ్ స్టేషన్ పాయింట్‌లో ఏర్పాటుచేసిన ఇంజన్ ఆయిల్ మార్పు కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమములో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, జిల్లా రెవిన్యూ అధికారి వినాయకం, ఐ.ఓ.సి.యల్ ప్రతినిధులు శ్రీరాం, శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.

పాల్వాయిగేట్ పోలింగ్ స్టేషన్‌లోని
పీవో, ఏపీవోలపై సస్పెన్షన్‌ను తొలగించాలి

● మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ

నరసరావుపేట టౌన్, జూన్ 21: సార్వత్రిక ఎన్నికలలో మాచర్ల నియోజకవర్గం పాల్వాయిగేట్ పోలింగ్ స్టేషన్‌లో పీవో పీవీ సుబ్బారావు, ఏపీవో ఎస్కే షహనాజ్‌లపై సస్పెన్షన్ తొలగించాలని మాజీ ఎంఎల్‌సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ కోరారు. శుక్రవారం నసరావుపేట పల్నాడు కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శ్రీకేశ్ బీ లాట్కర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ బీ హైమారావు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బీపీ నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు సెల్వరాజు, ప్రధాన కార్యదర్శి కే రాజాచౌదరి తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ళ నిర్మాణాల వద్ద ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

వీరపనేనినగర్ వాసులను ఆదుకోవాలి

వినుకొండ, జూన్ 21: ఇళ్ళస్థలాల పోరాట కమిటీ, సీపీఎం నాయకులు హనుమంతారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని విఠంరాజుపల్లిలోని వీరపనేనినగర్‌లో ఇళ్ళ నిర్మాణాల వద్ద లబ్ధిదారులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. హనుమంత్‌రెడ్డి మాట్లాడుతూ 2003లో అప్పటి ఎమ్మెల్యే వీరపనేని యలమందరావు 50మంది పేదలకు ఒక్కొక్కరికీ మూడు సెంట్లు చొప్పున నివేశన స్థలాలను అందజేయగా వారిలో 23మంది రేకుల షెడ్లు, గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జగనన్న కాలనీల పేరుతో 2020 జూన్ 21వ తేదీన స్థానిక వైసీపీ నాయకులు అప్పటి ఫీల్డ్ అసిస్టెంట్ సునీల్ మరికొందరు కలసి ఇదే పేదల స్థలాలు ఆక్రమించే ప్రయత్నం చేశారని తెలిపారు. అప్పటి వైసీపీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అండదండలతో నిర్మించుకొన్న పేదల ఇళ్లు కూల్చివేసి సామగ్రి కరెంట్ మీటర్లను తీసుకెళ్ళారని, అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోక పోవడంతో హైకోర్టును ఆశ్రయించగా నివేశన స్థలాలు పేదలకు చెందినవేనని, అధికారులు జోక్యం చేసుకోరాదని హైకోర్టు ఆదేశించినట్లు బాధితులు తెలిపారు. గతేడాది మరలా ఇళ్లు కట్టుకొనేందుకు ప్రయత్నించగా వైసీపీ నాయకులు అడ్డుకొని దాడులకు పాల్పడ్డారని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం మారాక ఐదురోజుల నుంచి పనులు ప్రారంభించడం జరిగిందని, ఇప్పుడు కూడా వైసీపీ నాయకుల ఒత్తిడితో రెవెన్యూ అధికారులు లబ్ధిదారులను బెదిరించేందుకు ప్రయత్నించినట్లు ఆయన వివరించారు. ప్రస్తుత ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులకు జరిగిన విషయాన్ని వివరిస్తామని, తమకు న్యాయం చేయాలని జాస్తి లింగయ్య, శేషయ్య, నాగరాజు, అంజమ్మ, చింతపల్లి కుమారి తదితరులు విజ్ఞప్తి చేశారు.

సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు పాటించాలి

● జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్

శావల్యాపురం, జూన్ 21: వర్షాకాలం ప్రారంభం కానున్నందున గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలంతా సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలను పాటించాలని జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ తెలిపారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు కార్యక్రమంలో భాగంగా శావల్యాపురం, కనమర్లపూడి గ్రామాలలో శుక్రవారం ఆయన పర్యటించి పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై తీసుకుంటున్న జాగ్రత్తలపై డాక్టర్ రమ్యను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి సుబ్బారావు, హెల్త్ సూపర్‌వైజర్‌లు ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్‌నర్సు లక్ష్మీప్రసన్న, ల్యాబ్ అసిస్టెంట్లు సీతారామయ్య, సతీష్, ఎంఎల్‌హెచ్‌పీ సంకీర్తన, వెంకట్రావు, ఏఎన్ఎం రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ కార్డుల మంజూరును వేగవంతం చేయాలి: తహసీల్దార్

యడ్లపాడు, జూన్ 21: కౌలురైతు గుర్తింపు కార్డులు (సీసీఆర్‌సీ కార్డులు) మంజూరును వేగవంతం చేయాలని తహసీల్దార్ ఆశ్రఫున్నీసా బేగం అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో సీసీకార్డుల మంజూరుపై వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ప్రతిరోజు వీఆర్వో 10 దరఖాస్తులను పరిశీలించి కార్డులను మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. అలాగే ఆర్బీకేలలోని వ్యవసాయ సహాయకులు కూడా 10 దరఖాస్తులను పరిశీలిస్తారన్నారు.



ప్రమాణ స్వీకారం అనంతరం నారా చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, నారా లోకేష్‌లకు ధన్యవాదాలు తెలుపుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

డాక్టర్ చదలవాడ అరవిందబాబు అను నేను...

● టీడీపీ ఎమ్మెల్యేగా శాసనసభలో తొలిఅడుగు ● రెండు దశాబ్దాల తర్వాత నరసరావుపేట నుంచి చట్ట సభలోకి టీడీపీ అభ్యర్థి

నరసరావుపేట రూరల్, జూన్ 21: భారీ మెజార్టీతో విజయ ఢంకా మోగించిన నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు చట్ట సభలో తొలిఅడుగు పెట్టారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత నరసరావుపేట గడ్డపై తెలుగుదేశం పార్టీ జెండా ఎగరేసి సగర్వంగా అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నో అవమానాలు, ఆటు పోట్లు ఎదుర్కొని.. గెలుపే ధ్యేయంగా ప్రజల్లో మమేకమయ్యారు. ప్రత్యర్థుల కుట్రలపై పోరాడి భారీ మెజార్టీతో ప్రజా నాయకుడిగా గెలుపొంది చట్ట సభకు చేరారు. శుక్రవారం డాక్టర్ చదలవాడ అరవింద బాబు అనే నేను అంటూ ప్రమాణ స్వీకారం చేశారు. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తానన్న మాటకు కట్టుబడి పని చేస్తానని తెలిపారు. నరసరావుపేట ప్రజానీకం పెట్టుకున్న ఆశలు, ఆశయాలను సాకారం చేయడం కోసం అనునిత్యం ప్రజల్లోనే ఉంటానన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని ఫరిడవిల్లేలా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం ప్రజల్లో నిలుస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ తెలిపారు. ప్రమాణ శ్రీకారం అనంతరం ముఖ్యమంత్రి నారాచంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, మంత్రివర్యులు నారా లోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు.

విలువైన ప్రభుత్వ భూమి కబ్జా

● భూమి చుట్టూ కంచె ● కబ్జాలో రెవెన్యూ అధికారి హస్తం



కొండవీడు రెవెన్యూ సంగంగోపాలపురం పరిధిలోని ప్రభుత్వభూమి చుట్టూ వేసిన ఫెన్సింగ్

యడ్లపాడు, జూన్ 21: యడ్లపాడు మండలం కొండవీడు రెవెన్యూ సంగంగోపాలపురం పరిధిలో సుమారు రూ.50లక్షల విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ భూకబ్జా చర్చనీయాంశంగా మారింది. కొండవీడు రెవెన్యూ సంగంగోపాలపురం గ్రామ పరిధిలోని సర్వే నం.517లో సుమారు 2.50 ఎకరాల ఖాళీ ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి అంబేద్కర్ గురుకుల పాఠశాలకు ఆనుకుని ఉండడంతో విలువ పెరిగింది. దీనితో ఈ భూమిపై కబ్జారాయుళ్ళ కన్నుపడింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల విధుల్లో అధికారులు ఉండగా సదరు భూమి చుట్టూ భారీ ఇనుప కంచె అమర్చారు. సుమారు రూ.50లక్షల విలువైన ప్రభుత్వ భూమి చుట్టూ పకడ్బందీగా ఫెన్సింగ్ వేసినా అధికారులు సకాలంలో నివారణా చర్యలు చేపట్టకపోవడం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీని వెనుక ఓ మహిళా వీఆర్వో పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. తమ సమీప బంధువుకు చెందినదంటూ దగ్గర ఉండి మరీ ఫెన్సింగ్ వేయించినట్లు సమాచారం. కంచె చేను మేసిన చందంగా ప్రభుత్వ భూములను రక్షించాల్సిన రెవెన్యూ అధికారి కబ్జాకు పాల్పడడం విస్మయానికి గురిచేస్తోంది. ఈ విషయమై తహసీల్దార్ ఆశ్రఫున్నీసా బేగంను వివరణ కోరగా ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైన విషయం తన దృష్టికి రాలేదని, పరిశీలించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మిగులు భూముల జాబితాలో..

కబ్జాకు గురైన సర్వే నంబరు 517లోని భూమి మిగులు భూముల జాబితాలో చేర్చబడింది. 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మండలంలోని మిగులు ప్రభుత్వ భూముల సర్వే నిర్వహించారు. 2007 నాటికి సర్వే పూర్తిచేసిన అధికారులు 534 ఎకరాలు మిగులు భూములు ఉన్నట్లు తేల్చారు. సదరు భూములలో బోయపాలెం పరిధిలోని టెక్స్‌టైల్ పార్కుకు 110, ఫైదవోలు, ఉప్పరపాలెం గ్రామాల పరిధిలోని స్పైసెస్‌పార్కుకు 120 ఎకరాలు, కుష్టువ్యాధిగ్రస్తుల సాగుకు 23 ఎకరాలు, నివేశన స్థలాలకోసం 2ఎకరాలను కేటాయించారు. అంతేగాకుండా విద్యా సంస్థలకు, డంపింగ్‌యార్డుకు సుమారు 30ఎకరాలను కేటాయించారు. మరో 100 ఎకరాలకు సంబంధించి ఆర్డీవో కోర్టులో పెండింగ్ ఉండగా 150 ఎకరాలు మిగులు భూమిగా అధికారులు లెక్క తేల్చారు. మిగులు భూములను ఎస్సీ ఎస్టీలకు పంపిణీ చేయాలని ఎంఆర్పీఎస్ సభ్యులు ప్రభుత్వానికి విన్నవించుకోగా ప్రభుత్వం 2009లో ఎస్సీ కమిషన్‌ను నియమించింది. కమిషన్ ప్రభుత్వ భూముల వివరాలను సేకరించి మిగులుగా ఉన్న 150 ఎకరాలు పేదలకు భూపంపిణీ చేసేందుకు ఎటువంటి అభ్యంతరం లేదంటూ 2010 మే 30 నివేదికను సమర్పించారు. అయితే నివేదికపై అప్పటి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అంతేగాకుండా మిగులు భూములను ఎవరికీ అసైన్డ్ చేసేందుకు వీలులేకుండా పోయింది. అయినప్పటికీ ఖాళీగా ఉన్న భూములను అటు రాజకీయ నాయకులు, ఇటు అధికారులు కాజేసేందుకు ప్రయత్నాలు చేస్తూ ఉన్నారు. చేతివాటం కలిగిన అధికారులు అడ్డగోలుగా ప్రభుత్వ భూములను పలుకుబడి కలిగిన నేతలకు దోచిపెడుతూ అందినకాడికి దండుకుంటున్నారు. ఇప్పటికైనా మండలంలోని మిగులు భూములను భూమిలేని పేద ఎస్సీ ఎస్టీలకు పంపిణీ చేయాలని ఆయా వర్గాల ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవం



ఎఎంరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో, రొంపిచర్ల మండలం రెడ్డిపాలెంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

నరసరావుపేట టౌన్, జూన్ 21: ఆధునిక, సాంకేతిక యుగంలో శారీరకంగా, మానసికంగా ఒత్తిడి తగ్గించుకోవాలంటే యోగా చేయాల్సిందేనని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం నరసరావుపేట పట్టణంలో పట్టాభిరామస్వామి ఆలయం వద్ద అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ అందరూ ప్రతిరోజూ యోగా చేయాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ప్రపంచాన్ని కాపాడుకోవాలన్నారు. ముందుగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు శ్రీవెంకటేశ్వరా యోగా సేవా కేంద్రం నరసరావుపేట శాఖ నిర్వాహకులు కూనిశెట్టి వెంకటజనార్దనరావు శాలువ కప్పి సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. అనంతరం యోగా దినోత్సవం సందర్భంగా మల్లమ్మ సెంటర్, శివుడి బొమ్మ సెంటర్, నుంచి పట్టాభిరామస్వామి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సేవా కేంద్రం కన్వీనర్ కె.అనూరాధ, సహాయ గురువులు, యోగ సాధకులు పాల్గొన్నారు.

● ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. యోగాసాధన చేయటం ద్వారా ఒత్తిడి, ఆదోళన తగ్గించుకోవచ్చు అని కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

● నరసరావుపేట పట్టణంలోని కే-రిడ్జి ఇంటర్ నేషనల్ స్కూల్‌లో శుక్రవారం ఘనంగా యోగా దినోత్సవం నిర్వహించారు. యోగ మాస్టర్ శివ, సునీతావాణి చిన్నారులతో సూర్యనమస్కారాలు చేయించి ఆసనాలు వేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లీశ్వరి, అకడమిక్ ఇన్‌చార్జ్ బర్న్ బాస్, చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, మ్యూజిక్ ఉపాధ్యాయిని నాగలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

● స్థానిక కేసానుపల్లిలో ఉన్న ఎంఏఎం గ్రూప్ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రూప్ సంస్థల చైర్మన్ ఎంఆర్ శేషగిరిరావు మాట్లాడుతూ యోగాభ్యాసం ద్వారా మానసిక, శారీరక ధృడత్వం కలుగుతుందన్నారు, కార్యక్రమంలో ట్రైనర్ ఆర్ లక్ష్మీప్రసన్న, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ప్రసాదరావు, ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రామారావు, లా కళాశాల ప్రిన్సిపాల్ కందుల వీరబ్రహ్మం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● నరసరావుపేట పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ మున్సిపల్ చైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్తా హాజరయ్యారు. కార్యక్రమంలో యోగా గురువు జీ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ మల్లయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్, పీఎన్‌సీకేఆర్ ప్రిన్సిపాల్ జీవీరావు, ఎస్‌కేఆర్‌బీఆర్ ప్రిన్సిపాల్ సీహెచ్ నాగిరెడ్డి, ఎస్‌సీసీ ఆఫీసర్ బీఎస్ఆర్‌కే రాజు, వై.అంజిరెడ్డి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

● నరసరావుపేట లీగల్: న్యాయస్థాన భవనాల ఆవరణలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 13వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎన్ సత్యశ్రీ, యోగా శిక్షకురాలు ఇంటూరి రంగలక్ష్మి, న్యాయాధికారులు కే మధుస్వామి, ఆర్ ఆశీర్వాదం పాల్, ప్రవలిక, న్యాయవాద సంఘ అధ్యక్షుడు ఎం నాగేశ్వరరావు, న్యాయవాదులు అమూల్య, ఏడుకొండలు, తిప్పేశ్వరరావు, అయ్యపరాజు, ఆరోగ్యం చౌదరి, కే విజయ కుమార్, పారా లీగల్ వలంటీర్లు, మొదటి పట్టణ సీఐ కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

● రొంపిచర్ల, జూన్ 21: మండలంలోని గ్రామాల్లో యోగా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులచే యోగాసనాలను వేయించారు. మానసిక ప్రశాంతతో పాటు ఆరోగ్యం కూడా సక్రమంగా ఉంటుందని ఉపాధ్యాయులు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవినీతికి తగిన మూల్యం చెల్లించక తప్పదు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



మాజీమంత్రి విడదల రజిని అవినీతిపై ప్రత్తిపాటికి ఫిర్యాదు చేస్తున్న పసుమర్రు గ్రామస్థులు

చిలకలూరిపేట అర్బన్, జూన్ 21 గత ప్రభుత్వ హయాంలో చేసిన అక్రమాలు, దోపిడీ, పాపాలకు విడదల రజిని తగిన మూల్యం చెల్లించక తప్పదని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గురువారం పసుమర్రు గ్రామానికి చెందిన పలువురు రైతులు ప్రత్తిపాటిని ఆయన నివాసంలో కలసి విడదల రజిని అక్రమాలపై వినతిపత్రం అందించారు. చిలకలూరిపేటలో జగనన్న కాలనీల పేరుతో ఆమె చేసిన దోపిడీ మొత్తాన్ని ఆధారాలతో నిరూపించి శిక్షలు వేయించటం ఖాయమన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన జగనన్న కాలనీలు అతిపెద్ద కుంభకోణమని భూమి కొనుగోలు, మౌలిక వసతుల పేరుతో వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని ప్రత్తిపాటి ఆరోపించారు. పసుమర్రుకు చెందిన రైతుల నుంచి రెండు వందల ఎకరాలు సేకరించి రూ.10 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు. రజినీ కాజేసిన తమ డబ్బును తిరిగి ఇప్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. వారి ఆవేదన మొత్తం విన్న ప్రత్తిపాటి జగనన్న కాలనీల పేరుతో పసుమర్రులో రైతులకు జరిగిన అన్యాయాన్ని రాష్ట్రవ్యాప్తంగా తెలియ జేస్తామన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలో జగనన్న కాలనీల కోసం భూమి కొనుగోలులో వందల కోట్లు చేతులు మారాయని, అందులో సింహభాగం విడదల రజిని, ఆమె కుటుంబ సభ్యులు బినామీల ఖాతాల్లోకి చేరాయని, దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని ప్రత్తిపాటి వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా పసుమర్రు చెందిన బాధిత రైతు గడిపూడి దశరథ రామయ్య మాట్లాడుతూ పసుమర్రులో మొత్తం నాలుగైదు విడతల్లో రెండు వందల ఎకరాలు సేకరించారని, ఒక్కో విడతలో ఒక్కో ధరకు భూములు తీసుకున్నామని, ఈ లావాదేవీల్లో సుమారు రూ.10 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. అనంతరం 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు మాట్లాడుతూ గతంలో పేదల ఇళ్ళకోసం పుల్లారావు హయాంలో 40ఎకరాలు సేకరించారని, అప్పుడు తమ వద్ద నుంచి రూపాయి కూడా తీసుకోలేదని, సేకరించిన 40 ఎకరాలకు ప్రతి పైసాతో సహా రైతులకు ఇప్పించారన్నారు. కాని 2019-24 మధ్య రజినీ మంత్రిగా ఉన్న సమయంలో రైతుల నుంచి 160 ఎకరాలు సేకరిస్తే ప్రభుత్వం నుంచి వచ్చిన డబ్బుల్లో వాటా తీసుకున్నారని వాపోయారు. రజినీకి చెందిన బినామీ ఖాతాల్లోకి విడతల వారీగా సుమారు రూ.10 కోట్లు బదిలీ చేసుకున్నారన్నారు. గొర్రెలమండీ రోడ్డుకు అడ్డుగా గోడ కట్టి విడదల లక్ష్మీనారాయణ కోటి అడిగారని ఆరోపించారు. డబ్బు చెల్లించలేదని గోడకట్టి ఆక్రమించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో వారే గోడ తొలగించారని, ప్రస్తుతం అక్కడ రాకపోకలు సాగుతున్నాయన్నారు. ఆ స్థలాన్ని పసుమర్రు పంచాయతీకి రాయించి ఇవ్వాలని కోరుతున్నామన్నారు. రైతుల వద్ద రజినీ కొట్టేసిన డబ్బులను కూడా ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పసుమర్రు గ్రామానికి చెందిన బాధిత రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

నాల్గోసారి ఎమ్మెల్యేగా ప్రత్తిపాటి ప్రమాణం



ప్రమాణ స్వీకారం అనంతరం ప్రత్తిపాటిని ఆలింగనం చేసుకున్న యువ నాయకుడు నారా లోకేశ్

చిలకలూరిపేట అర్బన్, జూన్ 21: శాసనసభలో మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ సీనియర్ శాసన సభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి ఆరుసార్లు పోటీచేసి నాల్గోసారి విజయం సాధించి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా సహచరుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. అధిష్ఠానం నుంచి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆత్మీయ ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. 1999లో మొదటిసారి టీడీపీ తరుపున చిలకలూరిపేట నుంచి విజయం సాధించారు. 2004లో ఓడిపోయినా 2009, 2014లో అదేస్థానంలో వరుసగా గెలుపొందారు. 2014 - 2019 మధ్య తెలుగుదేశం ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రిగా కూడా పనిచేసిన ప్రత్తిపాటి పార్టీ అప్పగించిన ప్రతి బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించారు. 2019లో మళ్లీ ఓటమి పలుకరించినా నిరాశ చెందకుండా 2024 సార్వత్రిక ఎన్నికల్లో భారీ ఆధిక్యంతో గెలిచి అసెంబ్లీలోకి ఘనంగా పునరాగమనం చేశారు. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జోన్-2 ఇన్‌చార్జ్‌గా వ్యవహరించి ఉభయగోదావరి జిల్లాల పరిధిలో కూటమి అద్భుత ఫలితాలు అందుకోవటంలో కీలక భూమిక పోషించారు.

పుల్లారావుకు ఎమ్మార్పీఎస్ నాయకుల సత్కారం

చిలకలూరిపేట, జూన్ 21: ఇటీవల ఎన్నికల్లో చిలకలూరిపేట నుంచి అసెంబ్లీ అభ్యర్థిగా గెలుపొందిన ప్రత్తిపాటి పుల్లారావును ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం కలసి అభినందనలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణమాదిగ తరుపున వారు ప్రత్తిపాటికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నియోజక వర్గానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు అద్దంకి బాబు మాదిగ, కొండెపోగు క్రాంతి మాదిగ, ప్రత్తిపాటి కోటిమాదిగ, మేదర సాగర్‌మాదిగ, బిరుదు కిరణ్ మాదిగ, మంద కృష్ణ మాదిగ, రత్నబాబు, దాని, అశోక్ తదితరులు ఉన్నారు.

రైతు సంఘం ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి

నాదెండ్ల, జూన్ 21: రైతు సంఘం ఆధ్వర్యంలో నాదెండ్ల మండలం ఎండుగుంపాలెంలో శుక్రవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా వ్యవసాయ సాగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతులు నాగళ్ళు, ట్రాక్టర్లతో ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా ఇన్‌చార్జ్ కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్ళూరి బాబూరావు మాట్లాడుతూ రైతుల అవసరాలను గుర్తించి ఆదుకోవటంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. సాగుకు సన్నద్ధమవుతున్న రైతులకు విత్తనాలు, ఎరువులు, అందుబాటులో ఉంచాలని కోరారు. నకిలీ విత్తనాలపై నిరంతరం నిఘా పెట్టాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. రైతులకు పెట్రోల్, డీజిల్ 50శాతం రాయితీతో అందించాలని కోరారు. కౌలు రైతులకు వడ్డీ లేకుండా రూ.3లక్షల వరకు రుణాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పర్వతనేని లక్ష్యాధికారి, చంద్ర కొండలరావు, నందిగం మస్తాన్‌రావు, గరికపాటి నాగేశ్వరరావు, హుస్సేన్, చిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన జనసేన నేతలు



మొక్కలు నాటుతున్న జనసేన నాయకులు

చిలకలూరిపేట, జూన్ 21: పట్టణంలోని 32వ వార్డులో మార్కెండేయ నగర్ కోదండ రామాలయం వద్ద శుక్రవారం జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు మొక్కలు నాటారు. పార్టీ సిద్ధాంతానికి అనుగుణంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా జనసైనికులు, వీర మహిళలతో కలసి మొక్కలు నాటారు. పార్టీ జిల్లా నాయకులు తోట రాజా రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జనసేన తరుపున 21మంది ఎమ్మెల్యేలు శాసనసభలో అడుగు పెట్టడం దేశ చరిత్రలో అరుదైన ఘట్టంగా భావిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆనందోత్సాహాలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మునీర్ హసన్, శివ శంకర్, నరసింహారావు, సాంబ, అరుణ, మల్లీశ్వరి, కల్పన, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షా శిబిరం

చిలకలూరిపేట, జూన్ 21: వేంకటరాయ శ్రీధర్ ఫౌండేషన్, రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9గంటల నుంచి స్థానిక నరసరావుపేట రోడ్డులోని రోటరీ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థల నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. శిబిరంలో రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్, నోటి క్యాన్సర్లకు నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తారని పేర్కొన్నారు.

రేపు యడ్లపాడులో వైద్య శిబిరం

యడ్లపాడు, జూన్ 21: యడ్లపాడు గ్రామాభివృద్ధి కమిటీ, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రెండు నెలలకు ఒకసారి నిర్వహించే ఉచిత షుగర్, బీపీ వైద్య శిబిరం ఆదివారం నిర్వహిస్తున్నట్లు సభ్యులు ముత్తవరపు రవీంద్రబాబు, సామినేని శ్రీనివాసరావులు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ యడ్లపాడులోని పీఆర్ విజ్ఞాన కేంద్రం వద్ద ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు

హత్యాయత్నం కేసులో నిందితుల లొంగుబాటు

నరసరావుపేట లీగల్, జూన్ 21: ఇటీవల ఎస్ఆర్‌కేటీ కాలనీలో చోటు చేసుకున్న టీడీపీ కార్యకర్త పై హత్యాయత్నం కేసులో నిందితులైన సలీం, సందాని, నాసర్‌వలి, రబ్బానీలు శుక్రవారం సాయంత్రం స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టులో లొంగి పోయారు. నిందితులకు జూలై 4వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి ప్రవలిక ఉత్తర్వులు జారీ చేశారు.

ఇన్‌చార్జి ఎంఏవోగా రామారావు బాధ్యతల స్వీకరణ

శావల్యాపురం, జూన్ 21: శావల్యాపురం మండల ఇన్‌చార్జి వ్యవసాయశాఖాధికారిగా రామినేని రామారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం ఈపూరు మండల వ్యవసాయశాఖాధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు డిప్యుటేషన్‌పై ఇక్కడ ఎంఏవోగా బాధ్యతలు నిర్వహించిన పల్లపోతు ప్రవీణ్ ప్రభుత్వం డిప్యుటేషన్లను రద్దు చేయడంతో జిల్లా వనరుల కేంద్రానికి బదిలీపై వెళ్ళారు. బాధ్యతలు స్వీకరించేందుకు వచ్చిన ఎంఏవో రామారావును వ్యవసాయశాఖ సిబ్బంది, వీఏఏలు ఘనంగా సత్కరించారు. ఎంఏవో రామారావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందున రైతులు పొలాల్లో చల్లుకొనేందుకు ప్రభుత్వం రాయితీపై అందించే జనుము, జీలుగ, పిల్లిపెసరలు మండలంలోని 11 రైతుభరోసాకేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉన్నాయని, రైతులు వీఏఏలను సంప్రదించి వాటిని తీసుకోవచ్చన్నారు. పీఎం కిసాన్ పథకానికి అర్హులైన వారంతా వీఏఏలను సంప్రదించి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కౌలురైతులు సీసీఆర్సీ కార్డుల కోసం వీఆర్వోలకు దరఖాస్తు చేసుకోవాలని, సీసీఆర్సీ కార్డులుంటే వారికి కూడా రైతుభరోసా పథకాన్ని వర్తింపజేసేందుకు కృషి చేస్తామన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యతాప్రమాణాలను పాటించాలి: ఎంఈవో

శావల్యాపురం, జూన్ 21: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో ఎండీఎం ఆపరేటర్‌లు నాణ్యతా ప్రమాణాలను తప్పకుండా పాటించాలని మండల విద్యాశాఖాధికారి మద్దిగుంట్ల సాంబశివరావు అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. విద్యార్థులతో కలసి భోజనం చేసి ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీచేశారు. భోజనంలో ఇంకా నాణ్యత పెంచాలని ఎండీఎం ఆపరేటర్‌కు సూచించారు. ఎంఈవో మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో ప్రభుత్వ మెనూను తప్పకుండా పాటించాలని, విద్యార్థులకు ప్రతిరోజూ కోడిగుడ్డు, చిక్కీలను అందించాలన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా బడిబయటి పిల్లల్ని పాఠశాలలో చేర్పించి విద్యార్థుల సంఖ్యను మరింతగా పెంచాలని హెచ్‌ఎం శర్మకు సూచించారు. ప్రభుత్వం అందించిన స్టూడెంట్స్ కిట్స్‌లోని అన్ని వస్తువులను విద్యార్థులకు అందించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఉపాధ్యాయని మాలతి, సీఆర్పీ రావూరి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.